ఆంధ్రజ్యోతి



అతడే ఒక సైన్యం...

- విలక్షణం పీలేరు విజేత నల్లారి జీవితం
- పోరాటమే ఆలంబనగా గెలిచి నిలిచిన వైనం

పీలేరు, జూన్ 6: పీలేరు నియోజకవర్గంలో 2019లో ఎదురైన ఘోరపరాభవం తరువాత టీడీపీ కకావికలమైంది. అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ సాగించిన దమనకాండ కారణంగా చాలామంది కరుడుగట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగినవారు వైసీపీలోకి వెళ్లిపోయారు. ఇక పీలేరు నియోజకవర్గంలో టీడీపీ మనుగడ కష్టమనుకున్నారు. ఎటు కదలాలన్నా ఒకవైపు ప్రభుత్వ నిర్బంధం, మరోవైపు ఆశించిన మేరకు పార్టీ శ్రేణుల్లో కనిపించని ఉత్సాహం. అటువంటి పరిస్థితుల్లో ఆయన ఒక్కో ఇటుక పేర్చుకుంటూ పీలేరు నియోజకవర్గంలో టీడీపీని పునర్నిర్మించారు. ఆ క్రమంలో పోలీసు కేసులు ఎదురైనా, ఆయన జీవితంలో ఎన్నడూ లేని విధంగా కొంతకాలం అజ్ఞాత జీవతం గడపాల్సి వచ్చినా భయపడలేదు. ఒక్కొక్క అడుగు ముందుకు సాగుతూ విజయతీరాలకు చేరారు. ఆయనే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి. పాతికేళ్ల తరువాత పీలేరు నియోజకవర్గంలో 25 వేల మెజారిటీతో టీడీపీ జెండాను రెపరెపలాడించారు.

తండ్రి, అన్న చాటు నుంచి స్వతంత్రుడిగా...

35 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నాటి నుంచి 2014 వరకు తండ్రి అమరనాథరెడ్డి, అన్న నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి చాటున ఉండేవారు. తొలుత తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ ఉన్న ఆయన తండ్రి మరణం తరువాత రాజకీయాల్లోకి వచ్చిన అన్నకు తోడుగా నియోజకవర్గంలో వ్యవహారాలు చక్కబెట్టేవారు. 2014లో తొలిసారిగా ఆయన జై సమైక్యాంధ్ర పార్టీ తరపున పీలేరు అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగారు. అప్పటి వరకు అన్న కిరణ్‌కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన స్థానంలో ఆయన పోటీకి దిగారు. గెలుపు నల్లేరుపై నడకే అన్నట్లుగా అనిపించినప్పటికీ అనూహ్యంగా ఆయన ఓటమి చవిచూశారు. ఆ తరువాత మూడేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. చెదిరిపోతున్న అభిమాన, అనుచరగణం, అంతకంతకూ పెట్రేగిపోతున్న ప్రత్యర్థి శిబిరాన్ని నిలువరించడం కోసం రాజకీయంగా మళ్లీ క్రియాశీలం కావాలన్న ఆలోచనతో అన్నతో విభేదించి 2017లో టీడీపీలో చేరారు. ఆ తరువాత 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున పీలేరు నుంచి పోటీ చేసినప్పటికీ 7 వేల ఓట్ల తేడాతో చింతల రామచంద్రారెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. వరుసగా రెండు ఓటముల తరువాత ఎవరైనా కాసింత ఆలోచించుకుని రాజకీయాలు సాగిస్తారు. కానీ ఆయన ఎక్కడా మరో ఆలోచన లేకుండా 2019 నుంచి మళ్లీ ప్రజల్లోకి వెళ్లడం ప్రారంభించారు. ఐదేళ్ల పాటు అనునిత్యం ప్రజల్లో ఉంటూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాడారు. అదే ఆయనకు కలిసి వచ్చి విజయతీరాలకు చేర్చింది.

కలిసి వచ్చిన కుటుంబ సభ్యుల సహకారం


ఐదేళ్లుగా ఒంటరిగానే రాజకీయాలు సాగించిన నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి పుంగనూరు, అంగళ్లు ఘటనల తరువాత కుటుంబసభ్యుల సాయం తీసుకున్నారు. వారి సహకారం కూడా ఆయనకు ఈ ఎన్నికల్లో బాగా కలిసి వచ్చింది. అంగళ్లు, పుంగనూరు ఘటనల్లో సంబంధం లేకపోయినా పెద్దిరెడ్డి కుటుంబం ఉద్దేశ్యపూర్వకంగా కిశోర్‌కుమార్‌రెడ్డిని ఆ కేసుల్లో ఇరికించింది. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అదే సమయంలో పీలేరు నియోజకవర్గానికి చెందిన 135 మందిపై కూడా అవే కేసులు బనాయించారు. పార్టీ క్యాడర్ భయపడకుండా ఉండడమే కాకుండా కేసుల్లో ఇరుక్కున్న వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించే ఆలోచనతో కిశోర్‌కుమార్ రెడ్డి తన సతీమణి నల్లారి తనూజారెడ్డిని రంగంలోకి దించారు. భర్త అజ్ఞాతం వీడి వచ్చేంత వరకు ఆమె నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ క్యాడర్‌లో మనోనిబ్బరం నూరిపోశారు. దానికితోడు కేసుల్లో ఇరుక్కున్న 135 మందికీ తన స్వంత ఖర్చులతో రాష్ట్ర హైకోర్టులో బెయిలు తీసుకురావడంతో నల్లారి కుటుంబంపై పీలేరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు నమ్మకం మరింత పెరిగింది. ఆ తరువాత ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత ఆయన కుమారుడు డాక్టర్ నల్లారి అమరనాథరెడ్డి, కోడలు డాక్టర్ నల్లారి షమారెడ్డి, కుమార్తె వైష్ణవి నియోజకవర్గమంతటా పర్యటించారు. నియోజకవర్గంలోని దాదాపు ప్రతి గడపనూ వారు పలకరించారు. వారి ప్రచారం ప్రజలపై బాగా ప్రభావం చూపించింది. దాని పర్యవసానం ఫలితంలో కనిపించింది.

నిండా మునిగారు..





- వైసీపీ ప్రభుత్వం వస్తుందని భారీగా బెట్టింగ్‌లు
- రూ.30 కోట్లు బెట్టింగ్ పెట్టిన ఎన్ఆర్ఐ డాన్ మహిళ
- రూ.100 కోట్లకు పైబడి రాజంపేటలోనే వైసీపీ తరపున జరిగిన బెట్టింగులు



రాజంపేట, జూన్ 6: వైసీపీ ప్రభుత్వం వస్తుందని.. ఉమ్మడి కడప జిల్లాలో పదికి 10 స్థానాల్లో వైసీపీ గెలుస్తుందని, పులివెందులలో జగన్‌కు లక్ష మెజార్టీ వస్తుందని.. ఇలా అనేక విధాలుగా బెట్టింగ్‌లు పెట్టిన వాళ్లంతా నిండా మునిగిపోయారు. ఒక్క రాజంపేట నియోజకవర్గంలోనే వైసీపీ తరపున బెట్టింగ్ పెట్టిన పార్టీ సానుభూతిపరులు ఏకంగా వంద కోట్లు పోగొట్టుకున్నారు. ప్రధానంగా మూడు దశాబ్దాలుగా కువైత్‌లో ఉంటూ వందల కోట్లకు పడగలెత్తి రాజంపేట రియల్ ఎస్టేట్‌ను ఒక ఆట ఆడించిన మహిళా డాన్‌గా పేరొందిన ఓ ఎన్ఆర్ఐ మహిళ వైసీపీ తరపున రూ.30 కోట్లు బెట్టింగ్ పెట్టి పోగొట్టుకోవడం రాజంపేట ప్రాంతంలో తీవ్ర సంచలనంగా మారింది. ఉమ్మడి కడప జిల్లాలో 2019 ఎన్నికల్లో మొత్తం 10 స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఒక్క సీటు కూడా టీడీపీకి రాలేదు. రాయలసీమంతా మూడు సీట్లు మినహా మొత్తం వైసీపీ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో వైసీపీ గత ఎన్నికల్లో ఏకంగా 151 స్థానాలను కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఎలాగైనా తిరిగి రాష్ట్రంలో, జిల్లాలోనూ ఉమ్మడి కడప జిల్లాలోనూ, రాయలసీమ ప్రాంతంలోనూ పెద్ద ఎత్తున సీట్లు కైవసం చేసుకుని అధికారం చేజిక్కిచ్చుకుంటుందని ఇక్కడి వైసీపీ నేతలు బలంగా భావించి వైసీపీకి చెందిన ప్రధాన నేతలు ఏకంగా రూ.100 కోట్లకు పైబడి బెట్టింగ్‌లు పెట్టారు. ఆ మహిళతో పాటు వైసీపీకి చెందిన నాయకులు, రియల్టర్లు, ఓ మోస్తరు నాయకులు, బిల్డర్లు, ప్రధానంగా వైసీపీ సానుభూతిపరులంతా 10 వేల నుంచి కోట్ల రూపాయల వరకు బెట్టింగ్ పెట్టినట్లు తెలిసింది. రాష్ట్రంలో తిరిగి జగనే అధికారం చేజిక్కించుకుంటారని ఒకవైపు, రాష్ట్రంలో వైసీపీ ఇన్ని సీట్లు కైవసం చేసుకుంటుందని ఒకవైపు, ఉమ్మడి కడప జిల్లాలో ఇన్ని సీట్లు వస్తాయని మరోవైపు, రాయలసీమలో అన్ని సీట్లు వస్తాయని మరోవైపు, ఉభయగోదావరి జిల్లాల్లో ఇన్ని సీట్లు వస్తాయని బెట్టింగులను పెట్టారు. రాజంపేటలో వైసీపీ ఎమ్మెల్యే గెలుస్తాడని వైసీపీ తరపున బెట్టింగులు పెట్టిన వారు మాత్రం పైసలు సంపాదించుకున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో వైసీపీ తరపున పెట్టిన కోట్ల రూపాయల బెట్టింగ్ పూర్తిగా పోగొట్టుకున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో స్థానాలన్నీ వైసీపీనే కైవసం చేసుకుంటుందని, కడపలో వైసీపీనే గెలుస్తుందని, పులివెందుల్లో జగన్‌కు లక్ష మెజార్టీ తగ్గదని, కడప పార్లమెంటులో అవినాశ్‌రెడ్డికి లక్షల ఓట్లలో మెజార్టీ వస్తుందని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కడప ఎంపీ స్థానంలో ఇన్ని ఓట్లు వస్తాయని ఈ విధంగా అనేక రూపాల్లో బెట్టింగ్‌లు పెట్టారు. దీంతో పాటు రాష్ట్రంలోని ఫలానా మంత్రులు గెలుస్తారని, రాజంపేటలో ఎంపీ మిధున్‌రెడ్డి మూడోసారి లక్షల మెజార్టీలో గెలుస్తారని, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో 50 వేలు పైచిలుకు ఓట్లతో గెలుస్తారని, తిరుపతిలో భూమన అభినయరెడ్డి గెలుస్తారని, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గెలుస్తారని, శ్రీకాళహస్తిలో మధుసూదన్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని, నగరిలో రోజాదే విజయమని, నెల్లూరులో ఇన్ని సీట్లు వస్తాయని ఈ విధంగా బెట్టింగులు పెట్టినట్లు తెలిసింది. రాజంపేటలో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి 13,500 నుంచి 20 వేలు పైచిలుకు మెజార్టీతో గెలుస్తారని, మండలాల వారీగా ఒక్క రాజంపేట మినహా వైసీపీనే మెజార్టీ సాధిస్తుందని బెట్టింగులు పెట్టారు. రాయచోటిలో శ్రీకాంత్‌రెడ్డి విజయం సాధిస్తారని, బీజేపీ రాజంపేట ఎంపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రెండు లక్షలతో ఓటమి చెందుతారని బెట్టింగులు పెట్టారు. వారి అంచనాలు తల్లకిందులు కావడంతో మొత్తం సొమ్మును పోగొట్టుకోవాల్సి వచ్చింది. ప్రధానంగా ఎన్ఆర్ఐ డాన్ మహిళ కోట్లు పోగొట్టుకోవడం ఇక్కడ పెద్ద హాట్ టాపిక్‌గా మారింది.

సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే దాకా...



ముక్కావారిపల్లెలో శ్రీధర్, రూపానందరెడ్డిలకు అభినందనలు తెలుపుతున్న ప్రజలు

- అరవ శ్రీధర్‌ను వరించిన అదృష్టం
- తండ్రి వెంకటయ్య వీఆర్‌వో

రైల్వేకోడూరు, జూన్ 6: నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలంలోని అమృతవారిపల్లె దళితవాడలో సాధారణ వీఆర్ఏగా పనిచేస్తున్న వెంకటయ్య, ప్రమీల కుమారుడు అరవ శ్రీధర్. వెంకటయ్య, ప్రమీలకు సంతానం శ్రీధర్‌తో పాటు ఒక ఆడబిడ్డ ఉన్నారు. వెంకటయ్య 2019 వరకు ఓబులవారిపల్లె మండలంలో వీఆర్ఏగా పనిచేశారు. ప్రమోషన్‌పై రైల్వేకోడూరు మండలం చియ్యవరం గ్రామ పంచాయతీలో ప్రస్తుతం వీఆర్‌వోగా పనిచేస్తున్నారు. కాగా శ్రీధర్ 2018లో నంద్యాలలో బీటెక్ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. 2021లో ముక్కావారిపల్లె సర్పంచ్ స్థానం ఎస్సీలకు కేటాయించారు. వైసీపీ మద్దతుగా అమృతవారిపల్లెకు చెందిన ఒక యువకుడిని ఒక వర్గం వారు నెలబెట్టాలని అనుకున్నారు. ముక్కావారిపల్లె పంచాయతీకి మంచి వ్యక్తి కావాలని ముక్కా రూపానందరెడ్డి అన్వేషించారు. అమృతవారిపల్లెకు చెందిన అరవ శ్రీధర్ విద్యావంతుడు, మంచి యువకుడు అని గుర్తించి పోటీ చేయించారు. మంచి మెజార్టీతోనే సర్పంచ్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి అరవ శ్రీధర్ దశ తిరిగింది. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండడం, పంచాయతీకి వచ్చిన నిధులతో అభివృద్ధికి బాటలు వేశారు. ఇదిలా ఉండగా ముక్కా రూపానందరెడ్డి వైసీపీలో రెబల్ కావడం, టీడీపీలో చేరడం, రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ పదవిని దక్కించుకోవడం జరిగిపోయాయి. రైల్వేకోడూరు ఎస్సీ స్థానం జనసేనకు కేటాయించడం, ఒకరికి ఇచ్చిన టిక్కెట్టును మార్చుకుని అరవ శ్రీధర్‌కు వరించడం, నాలుగుసార్లు విజయం సాధించిన వైసీపీ ఎమ్మెల్యేపై పోటీ చేసి విజయం సాధించడం ఎమ్మెల్యే కావడం అంతా 50 రోజుల్లో జరిగిపోయింది. మారుమూల దళితపల్లెలో పుట్టిన యువకుడు శ్రీధర్ దశ ఇలా తిరుగుతుందని కలలో కూడా ఊహించి ఉండరు. అదేకాకుండా 27 ఏళ్ల వయస్సులోనే ఎమ్మెల్యే అయ్యారు. రైల్వేకోడూరుకు పూర్వవైభవం తీసుకొచ్చిన దానిలో ముక్కా రూపానందరెడ్డి శ్రమ కూడా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.





అమృతవారిపల్లె దళితవాడలో శ్రీధర్ ఇల్లు

కడప ఎంపీ స్థానానికి ఎవరికెన్ని ఓట్లంటే..



కడప(కలెక్టరేట్), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. విజేతలెవరో తేలిపోయింది. అయితే.. నువ్వా నేనా అన్నట్టుగా కడప ఎంపీ స్థానానికి పోటీ జరిగింది. బరిలో వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి, టీడీపీ నుంచి భూపేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి జగన్ సోదరి షర్మిల దిగడంతో.. ఈ స్థానంపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో అని అందరూ ఎదురు చూశారు. కడప పార్లమెంట్ స్థానానికి మొత్తం 14 మంది పోటీ చేశారు. మొత్తం 13,23,510 ఓట్లు పోలయ్యాయి. 21,642 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉద్యోగులు వినియోగించు కున్నారు. వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి 6,05,143 ఓట్లు, టీడీపీ అభ్యర్థి సి.భూపేశ్ రెడ్డి 5,42,448 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి 1,41,039 ఓట్లు సాధించారు. మిగతా11 మంది అభ్యర్థులూ కలసి 22,199 ఓట్లు సాధించారు. మొత్తం మీద 1535 ఓట్లు తిరస్కరణకు గురికాగా.. పార్టీల అభ్యర్థులు నచ్చక నోటాకు 16,846 మంది ఓట్లు వేయడం గమనార్హం. నియోజక వర్గాల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరా లను పరిశీలిస్తే..

- వైసీపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డికి బద్వేలు నియోజకవర్గంలో 91,211, కడపలో 62,015, పులివెందులలో 1,08,134, కమలాపురంలో 75,232 ఓట్లు వచ్చాయి. అలాగే జమ్మలమడుగులో 96,996, ప్రొద్దుటూరులో 83,233, మైదుకూరులో 81,585, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 6,737 కలిపి మొత్తం 6,05,143 ఓట్లు వచ్చాయి.
- టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డికి బద్వేలులో 62,342, కడపలో 66,090, పులివెందులలో 47,757, కమలాపురంలో 79,750, జమ్మలమడుగులో 1,02,318, ప్రొద్దుటూరులో 90,964 ఓట్లు వచ్చాయి. మైదుకూరులో 83,317, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 10,090 కలిపి 5,43,244 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు.
- కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలరెడ్డికి బద్వేలులో 10,552, కడపలో 52,132, పులివెందులలో 25,956, కమలాపురంలో 12,080, జమ్మలమడుగులో 6,079 ఓట్లు వచ్చాయి. ప్రొద్దుటూరులో 19,964, మైదు కూరులో 9,632, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4,644 ఓట్లు కలిపి మొత్తం 1,41,039 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన 11 మంది అభ్యర్థుల్లో పందిటి గుర్రప్పకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 20తో కలిపి 3,810, వేణుగోపాల్‌కు 70 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి మొత్తం 3,570 ఓట్లు వచ్చాయి. సి.గోపాల క్రిష్టారెడ్డికి 16 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి 2,430 ఓట్లు, కుంచం వెంకట సుబ్బారెడ్డికి 4 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 2,333 ఓట్లు, ఖాజా హుసేన్‌కు 1 పోస్టల్ బ్యాలెట్ ఓటు కలిపి 1088 ఓట్లు, అంకిరెడ్డి సురేశ్‌రెడ్డికి 3 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 755 ఓట్లు వచ్చాయి. కాకర్ల షణ్ముగరెడ్డికి 14 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి 647 ఓట్లు, పల్లె రమేశ్‌కు 5 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 624 ఓట్లు, చాన్ బాషాకు 7 పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 439, జేవీ రమణకు 20 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి మొత్తం 434 ఓట్లు, ఎం.హనుమంతరెడ్డికి 11 పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 369 ఓట్లు వచ్చాయి. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ విజయ రామరాజు ఒక ప్రకటన విడుదల చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- డీఈఓ శివప్రకాశ్ రెడ్డి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సంబేపల్లె, జూన్ 6: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి మిషన్ లైఫ్ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి విద్యార్థులతో ర్యాలీ ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకుని మొక్కలు నాటుదాం-కాలుష్యాన్ని నివారిద్దాం, ప్లాస్టిక్ బ్యాగులు వద్దు- గుడ్డ సంచులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్‌ను అధికంగా వాడడం, అడవుల నరికివేత, ఏసీలు, ఫ్రిజ్‌లు ఎక్కువగా వాడడం, పారిశ్రామిక వ్యర్థాలు నదుల్లో కలిసిపోవడం తదితర కారణాల వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. పాఠశాలల్లో జూన్ 12 నుంచి 19వ తేదీ వరకు వారం రోజులపాటు మిషన్ లైఫ్ కార్యకలాపాలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ఏడీ ప్రసాద్‌బాబు, ఏపీవీఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, సమగ్ర శిక్ష సెక్టోరల్ సిబ్బంది కరుణాకర్, బాలాజీ, మధుసూదన్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీటీహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపరచండి : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, జూన్ 6: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో (జీటీహెచ్)లో పారిశుధ్య నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, వెంటనే పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు ఆయన జీటీహెచ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ ఆస్పత్రి ఆవరణంలో పలుచోట్ల పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పారిశుధ్యం నిర్వహించే కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని, నాలుగు రోజుల్లో మెరుగుపరచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. నిమ్మనపల్లె మండలం బండమీద ఓబులపల్లెకు చెందిన వృద్ధుడిపై అతడి మనవడు దాడి చేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధితుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చాడు. దీంతో ఎమ్మెల్యే నిమ్మనపల్లె ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడి బాధితుడికి న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల వైసీపీ పాలనలో సర్వజన బోధనాస్పత్రిలో కొంతమంది ఉద్యోగులను రాజశేఖర్ అనే వైద్యాధికారి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు లంచం తీసుకుని నియమించినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. అటువంటి ఉద్యోగులను హోల్డ్‌లో పెట్టి మెరిట్ ప్రాతిపదికన, మదనపల్లె నియోజకవర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జీటీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, భవానీప్రసాద్, శేషాచలపతినాయుడు, జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జీటీహెచ్ నుంచి నిమ్మనపల్లె ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మంగపట్నం చెరువుకు గండి

● తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆది ● గండి పూడ్చిన అధికారులు



చెరువు గండి నుంచి వస్తున్న నీరు- పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ముద్దనూరు జూన్ 6: మంగపట్నంలో భారీగా కురిసిన వర్షానికి పెద్ద చెరువుకు నీరు చేరి కట్టకు గండి పడింది. ప్రజలు నూతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులను పంపి గండి పూడ్చించారు. మంగపట్నంలో భారీ వర్షం కురిసింది. దీంతో కొత్తచెరువుకు కొండప్రాంతాల నుంచి భారీ ఎత్తున నీరు చేరింది. అక్కడి నుంచి పెద్దచెరువుకు వర్షపు నీరు రావడంతో కట్టబలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో చెరువు నుంచి వస్తున్న నీరు గ్రామం వైపు రాకుండా దారి మళ్లించారు. వెంటనే ప్రజలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఇరిగేషన్ అధికారులను పంపారు. వారు కట్టను పరిశీలించి గండి పడిన చోట మరమ్మత్తు చేయించేందుకు చర్యలు చేపట్టారు.

పెద్దచెరువు తెగితే ఊర్లోకి నీళ్లు వస్తాయి

- జనార్ధన్‌నాయుడు, గ్రామస్థుడు, మంగపట్నం

పూర్వం కొత్తచెరువు తెగిపోయి మంగపట్నం గ్రామం నీటి మునిగింది. అప్పట్లో పెద్దలు ఊరిలోకి నీరు రాకుండా గ్రామం పైభాగాన పెద్దచెరువును సొంత పొలాల్లో కట్ట ఏర్పాటు చేసుకున్నారు. కట్ట తెగిన వంక ద్వారా నీరు వెళుతుండేది. ప్రస్తుతం ఊరి వైపు కట్ట బలహీనమై గండి ఏర్పడింది. నూతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులను పంపి మరమ్మతు చేయించారు. వర్షాలు భారీగా కురుస్తున్నాయి. దీంతో ఏప్రమాదమైన ఊరికి పొంచి ఉండేది.

కొండాపురంలో కుండపోత వర్షం

చిన్నపల్లెలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు



కొండాపురం మండలం చిన్నపల్లె గ్రామం ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు

కొండాపురం, జూన్ 6: మండలంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో మండలంలో వాగులు, వంకలు ప్రవహించాయి. గండికోట ప్రాజెక్టులోకి వాగు, వంకల్లోని నీరు 200 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. తిమ్మాపురం చెరువు కట్ట వల్ల చిన్నపల్లె గ్రామంలో వర్షపు నీరు ఇండ్ల చుట్టూ చేరింది. గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎక్కువ వర్షం వచ్చినప్పుడల్లా ఇలా జరుగుతున్నా గత ప్రభుత్వం తమ ను పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని సంబంధించిన ఫైల్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వం లోనైనా తమ గ్రామాన్ని ముంపులోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఋతుపవనాలు ప్రారంభం కాగానే వర్షం కురుస్తుండడంతో రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6 : వైవీయూ ఎల్ఎల్‌బీ 3, 5 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ గురువారం విడుదల చేశారు. వీసీ చాంబరులో రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి ఫలితాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సులో మూడు సెమిస్టరు పరీక్షల్లో 50 శాతం, ఐదో సెమిస్టరు ఫలితాల్లో 74 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మూడో సెమిస్టరులో 67 శాతం ఉత్తీర్ణులయ్యారని, ఐదో సెమిస్టరులో 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీటితో పాటు ఎల్ఎల్‌బీ 7, 9 సెమిస్టరు ఫలితాలను వెల్లడించారు. 7వ సెమిస్టరులో 87 శాతం, 9వ సెమిస్టరులో 80 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ సహాయ అధికారి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కువైత్ యాదవ సంఘం ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న రాజాయాదవ్ తదితరులు

బద్వేలు రూరల్, జూన్ 6: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దుగ్గినేని రాజాకు కువైత్ యాదవ సంఘం లక్షా 76 వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక విద్యానగర్‌లో నివాసం ఉంటున్న దుగ్గినేని రాజా గత నెల 20న వ్యక్తిగత పనిపై పోరుమామిళ్లకు వెళ్లి అక్కడ అదుపు తప్పి బైకు డివైడరును ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం ఐదు లక్షల మేర ఖర్చు కావడంతో నిరుపేద కుటుంబమైన రాజా కుటుంబ సభ్యులు కువైట్ యాదవ సంఘాన్ని ఆర్థిక సాయం కోరడంతో కువైత్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లా బాబు, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజాయాదవ్ లక్షా 76 వేలు నగదును కడపలోని ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైవీయూకు 52 పరిశోధన ప్రాజెక్టులు

ఒకేసారి ఏ యూనివర్సిటీ పొందని ప్రాజెక్టు వైవీయూ సొంతం

కడప (ఎడ్యుకేషన్), జూన్ 6 : యోగివేమన యూనివర్సిటీకి ప్రతిష్టాత్మకంగా 52 పరిశోధన ప్రాజెక్టులు మంజూరయ్యాయి. రాష్ట్రీయ ఉచ్చతర శిక్ష అభియాన్-2 కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.3.49 కోట్లు విడుదల చేసింది. తొలివిడతగా 53 కోట్లు విడుదల చేసింది. ఒకేసారి 52 ప్రాజెక్టులు పొందిన విశ్వవిద్యాలయంగా వైవీయూకు కీర్తి దక్కనుంది. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఫెలోషిప్‌లు ఇవ్వడానికి పరిశోధన అవసరాల వినియోగం కోసం ఆధునిక పరికరాలు కొనుగోలు, నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు దోహదపడనుంది. వైవీయూలో 52 మంది ప్రొఫెసర్స్, అసిస్టెంటు ప్రొఫెసర్లు ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. రూసా-1 ద్వారా విడుదలైన 20 కోట్ల నిధులను ప్రభావవంతంగా వినియోగించడంతో పాటు ఆధునిక పరిశోధనలకు బీజం వేయడం వల్ల రూసా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పీఎం ఉషా (రూసా) కింద దేశంలోని ప్రతిష్టాత్మకమైన 75 సంస్థలకు ఒక్కో సంస్థకు 20 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో వైవీయూ కూడా ఉండడం గమనార్హం.

పరిశోధనల్లో మేటిగా వైవీయూ : వీసీ చింతా సుధాకర్

వైవీయూ బోధనా పరిశోధనాపరంగా నిపుణులైన అధ్యాపకులు ఇక్కడ ఉన్నారు. నాణ్యమైన బోధనలు చేస్తున్నందువల్లనే ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిధులు మంజూరు చేస్తున్నాయి. తద్వారా అకడమిక్ పరిశోధనా పరంగా విద్యార్థులకు యూనివర్సిటీ అత్యంత ప్రయోజకరం.

నేడు జడ్పీ చైర్మన్ రాజీనామా

- ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాలయ్య...?
- ప్రత్యేక పరిస్థితుల మధ్య.
- నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం
- ప్రశ్నార్థకంగా జడ్పీటీసీ సభ్యుల హాజరు

కడప(రూరల్), జూన్ 6: జిల్లా ప్రజాపరిషత్ (జడ్పీ) చైర్మన్ పదవికి, ఒంటిమిట్ట మండలం జడ్పీటీసీ పదవులకు ఆకేపాటి అమరనాథరెడ్డి శుక్రవారం రాజానామా చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేయనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి గెలుపొందారు. దీంతో ఆయన జడ్పీ చైర్మన్ పదవికి, జడ్పీటీసీకి రాజీనామా చేయాల్సి వచ్చింది. రాజీనామా అంశాన్ని గురువారం వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరించారు. జగన్ సమ్మతితో రాజీనామా చేయబోతున్నారు. ఆయన స్థానంలో జడ్పీ వైస్‌చైర్మన్-2 గా ఉంటున్న పెండ్లిమర్రి జడ్పీటీసీ సభ్యుడు పిట్టు బాలయ్యకు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం కనిపిస్తోంది.

25 సెప్టెంబరు 2021న జడ్పీ చైర్మన్‌గా..

2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. తదనంతరం 2021లో సెప్టెంబర్‌లో జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో వైసీపీ పెద్దలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాలలో 38 వాటిని ఏకగ్రీం చేసుకున్నారు. ఈమేరకు ఒంటిమిట్ట మండలం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా సెప్టెంబర్ 25న ప్రమాణస్వీకారం చేశారు. నేడు తన పదవికి రాజీనామా చేయనున్నారు. చైర్మన్ పదవిలో రెండు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు కొనసాగి పలు స్టాండింగ్ కమిటీ సమావేశాలను, జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించారు.

> **నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం**
>
> శుక్రవారం ఉదయం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగానే అమరనాథరెడ్డి జడ్పీ చైర్మన్ పదవికి రాజానామా చేయనున్నారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జ్ జడ్పీ చైర్మన్ హోదాలో జడ్పీ వైస్ చైర్మన్-2 బాలయ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. గత సమావేశం వరకు జడ్పీ చైర్మన్ హోదాలో ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన ప్రణాళిక మరియు ఆర్థికస్థాయి సంఘము, గ్రామీణాభివృద్ధి స్థాయి సంఘము, నిర్మాణపు పనుల స్థాయి సంఘము, విద్య మరియు వైద్యసేవల స్థాయి సంఘము సమావేశాలు నిర్వహించేవారు. ఇకనుంచి పై సమావేశాలను కూడా ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఎవరుంటే వారు నిర్వహించనున్నారు.

జడ్పీటీసీల్లో కంగారు

రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి వారి ప్రభుత్వం దిగిపోవడంతో జడ్పీటీసీలలో కంగారు మొదలైంది. నిన్నటి వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో స్టాండింగ్ కమిటీ, జడ్పీ సర్వసభ్య సమావేశాలను వారికి అనుకూలంగా నిర్వహించుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే జడ్పీ స్టాండింగ్ సమావేశానికి వైసీపీ ప్రభుత్వం దిగిపోవడంతో జడ్పీటీసీలు తాము అనుకున్న రీతిలో సాగవని భావించి కంగారు పడుతున్నారు.

శాఖల పనితీరుపై అర్థవంతమైన చర్చ సాగేనా...?

జడ్పీస్థాయి సంఘాల సమావేశాన్ని శుక్రవారం జడ్పీ సమావేశం హాలులో నిర్వహిస్తున్నారు. ఇప్పటికి వరకు నిర్వహించిన సమావేశాల్లో ఏనాడూ ఆయా శాఖల పనితీరుపై పూర్తిగా అర్థవంతమైన చర్చ కొనసాగించలేదు. ఆయా కమిటీల చైర్మన్లు, సభ్యులు ఆడపాదడపా ప్రశ్నలతోనే సమావేశాన్ని సరిపుచ్చుతూ వచ్చారు. సమావేశాల పేరుతో ఖర్చులు మాత్రం తడిపి మోపెడవుతున్నాయి. ప్రణాళిక అండ్ ఆర్థిక స్థాయి, గ్రామీణాభివృద్ధి స్థాయి, విద్య మరియు వైద్యసేవల స్థాయి, నిర్మాణపు పనుల స్థాయి, స్త్రీ సంక్షేమ స్థాయి, వ్యవసాయ స్థాయి, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సమావేశాలను నిర్వహించారే కానీ.. వీటివల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరలేదనే విమర్శలున్నాయి.



జడ్పీ సమావేశ భవనం

రైతులకు సకాలంలో అందని ఖరీఫ్ సాయం

ప్రస్తుతం 2024 ఖరీఫ్ ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే ప్రవేశించి వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. అయినప్పటికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నిన్నటి వరకు (జూన్ 4 వరకు) అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సకాలంలో అందించలేక చేతులు ఎత్తేసింది. దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో పచ్చిమిర్చి రూ.130 నుంచి రూ.160ల వరకు అమ్ముతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యపు పనులు సక్రమంగా కొనసాగడంలేదు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు సక్రమంగా అందడంలేదు. పీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల లేమి, సిబ్బంది కొరత వేధిస్తోంది. గ్రామీణ మంచినీటి సరఫరా పథకం నత్తనడకన సాగుతోంది. మట్టి మాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వీటన్నింటిపై సమీక్ష నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. కానీ ఈ దిశగా స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించకుండా మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. నేడు నిర్వహించే సమావేశమైనా పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలకు సంబంధించిన సమస్యలపై చర్చించి తగు పరిష్కారం చూపుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

> **వైసీపీ ఓటమితో షాక్‌లో జడ్పీటీసీ సభ్యులు**
>
> సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర చరిత్రలో కనీ వినీ ఎరుగని భారీ ఓటమిని చవిచూసింది. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించింది. ఇందులో ఉమ్మడి కడప జిల్లాలోని 10 ఎమ్మెల్యే స్థానాలను కైవశం చేసుకుంది. తదనంతరం జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా టక్కుటమారం విద్యలను ప్రదర్శించి జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాలకు గాను 49 వాటిని సొంతం చేసుకుంది. దీంతో టీడీపీకి జడ్పీలో వాయిస్ లేకుండా పోయింది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తుడిచుకుపెట్టుకుపోయింది.
>
> ప్రతిపక్ష హోదా కూడా లేనంతగా 11 ఎమ్మెల్యే స్థానాలతో సరిపెట్టుకుంది. జిల్లాలో టీడీపీ గత 30 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా 7 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకొని వైసీపీ వెన్నులో వణుకు పుట్టించింది. దీంతో ఆయా మండలాల్లోని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు షాక్‌లో ఉండిపోయారు. ఈ నేపథ్యంలో నేడు జరుగుతున్న స్టాండింగ్ కమిటీ సమావేశానికి జడ్పీటీసీ సభ్యుల హాజరు ప్రశ్నార్థకంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన సుబ్బులమ్మ, ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

సంబేపల్లె, జూన్ 6: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేను వడ్డెపల్లె బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కుంచపు సుబ్బులమ్మ (68) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేనువడ్డెపల్లెకు చెందిన సుబ్బులమ్మ సంబేపల్లెకు రావడానికి బస్సు కోసం బస్టాప్ వద్ద ఉండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె భర్త రామయ్య ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి పిల్లలు లేరని ఒంటరిగానే ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి



శ్రీను మృతదేహం

రైల్వేకోడూరు, జూన్ 6: మండలంలోని రాఘవ రాజపురం పంచాయితీలో బుధవారం సాయంత్రం దోస కాయలను లారీకి లోడింగ్ చేస్తుండగా విద్యుత్ తీగలు తగులుకుని యువకుడు మృతి చెందాడు. గురువారం రైల్వేకోడూరు హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ అందించిన వివరాల మేరకు.. మండలంలోని సూరపురాజుపల్లె గిరిజన కాలనీకి చెందిన మోపూరి శ్రీను (25) అనే యువకుడు రాఘవరాజపురం ప్రాంతంలో దోసకాయల లోడు కు వెళ్లి లోడింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగులుకుని కింద పడ్డాడు. దీంతో హుటాహుటిన తోటి కార్మికులు, రైతులు, వ్యాపారులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్షలు నిర్వహించి.. శవాన్ని తల్లి వెంకటమ్మకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగస్త్యేశ్వరస్వామికి భస్మార్చన



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 6: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. ఉజ్జయినీ మహంకాళేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే విధంగా గురువారం సాయంత్రం భస్మార్చన నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి సహస్రనామ భస్మార్చన, భస్మ హారతి, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానంలో పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూన్ 6: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో గురువారం అమావాస్య సందర్భంగా వీరభద్రస్వామి వారి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య, శంకరయ్య స్వాముల వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించి వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి మేళతాళాలతో, అర్చకుల వేద మంత్రాల నడుమ ఆలయం చుట్టూ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం అర్చక స్వాములు అర్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

సీకేదిన్నె, జూన్ 6: ఫ్యానుకు ఉరి వేసుకుని ఇల్లూరి సురేష్ (48) అనే ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సురేష్ భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు చింతకొమ్మదిన్నె మండలం విశ్వనాథపురం శివాలయం వద్ద నివాసం ఉండే సురేష్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడని, ఇతనికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్దకుమార్తెకు వివాహమైందని, చిన్న కుమార్తె ఇంటర్ చదువుతుండగా కుమారుడు ఇంటర్ వరకు చదువుకుని ప్రస్తుతం కూలి పనులు చేస్తున్నాడన్నారు. భర్త తాగుడుకు అలవాటుపడి తనతో కొట్లాడినప్పుడల్లా ఇంటిలోకి వెళ్లి గడియ పెట్టుకుని మద్యం మత్తు దిగిన తర్వాత బయటకు వచ్చేవాడన్నారు. ఇటీవలే చిన్నకుమార్తెకు రాజంపేట మండలం ములక్కాయలపల్లె గ్రామానికి చెందిన బంధువు మేనత్తకొడుకు సంబంధం మాట్లాడగా చిన్నకుమార్తె వివాహం వద్దని, ఏదైనా ఉద్యోగం తెచ్చుకున్న తర్వాతనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సురేష్ ఘర్షణ పడుతుండేవాడన్నారు.

ఈ సందర్భంలో చిన్నకుమార్తె తాను చెప్పిన వ్యక్తిని పెళ్లిచేసుకోవాలని గొడవపడి బెడ్‌రూములోకి పోయి మధ్యాహ్నం బయటకు వచ్చి భోజనం చేసి మరలా బెడ్‌రూములోకిపోవడంతో నిద్రపోతున్నాడని అనుకున్నామన్నారు. సాయంత్రం బెడ్‌రూములో భర్త ఫ్యానుకు ఉరి వేసుకుని ఉండడం చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి కిందకు దించి రిమ్స్‌కు తరలించగా వైద్యులు మృతిచెందినట్లు తెలిపారన్నారు. భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీపీ వర్గీయులపై జరిగిన దాడిపై కేసు నమోదు

రాయచోటిటౌన్, జూన్ 6: రాయచోటి మండల పరిధిలోని యండపల్లెలో బుధవారం రాత్రి టీడీపీ వర్గీయులపై జరిగిన దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం బుధవారం రాత్రి మాధవరం టీడీపీ నాయకుడు సైకం శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన విందుకు హాజరై తిరిగి రాయచోటికి వస్తుండగా మార్గమధ్యంలోని యండపల్లి గ్రామం బోయపల్లి వద్ద టీడీపీ వర్గీయులు సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వాగతం పలికారు. ఇది జీర్ణించుకోలేని మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి అనుచరులు ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు, సైకం శ్రీనివాసులరెడ్డి కుమారుడు వాహనంలో వెళుతుండగా రాళ్లతో వాహనంపై దాడి చేయడమే కాకుండా అడ్డువచ్చిన సిద్దార్థగౌడ్ తల్లి వెంకటలక్ష్మమ్మ, సోదరుడు శివశంకర్‌గౌడ్‌లపై దాడి చేసి గాయపరిచారు.

ఈ మేరకు బాధితురాలు వెంకటలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డికి సంబంధించిన 15 మంది అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్టు

● 10,500 కేజీల గంజాయి, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

కడప (క్రైం), జూన్ 6 : కడప నగరంలో గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. గు రువారం తన కార్యాలయంలో గంజాయి విక్రయాలు జరిపే ఆసిఫ్, అజ్జు, ల ద్వారా కడప మేకలదొడ్డికి చెందిన షేక్ నమీర్, మాసాపేటకు చెందిన షేక్ మహ్మద్ గౌస్, కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ మహ్మద్ రఫి, మోచంపేటకు చెందిన షేక్ సమీర్‌తో పాటు మైనర్ బాలుడిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కేజీల 500 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసి మరియు అమ్మే వ్యక్తులపైన గట్టిగా నిఘా పెట్టామని, స్పష్టమైన ఆదేశాలు మేరకు తమ సిబ్బంది ఎస్ఐ సంజీవరాయుడు సిబ్బందితో మాసాపేట, దొరల గోరీల వద్ద నిఘా ఉంచినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను విచారించగా షేక్ సమీర్, షేక్ మహ్మద్‌గౌస్, షేక్ మహ్మద్ అనే వ్యక్తుల వద్ద నుండి గంజాయి తెచ్చి కడప టౌన్‌లో కడప చుట్టూ పక్కల మండలాల్లో గంజాయి అమ్ముతూ ఉన్నట్లు తెలిపారు. గంజాయి నేరంలో పాల్గొన్న వారిపై హిస్టరీ షీట్లు తెరుస్తామని పదే పదే ఇలాంటి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 6: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9, తరగతులలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ లోపు మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. చదువుతున్న తరగతి స్టడీ సర్టిఫికెట్‌తో పాటు విద్యార్థి అమ్మ, నాన్న ఆధార్ కార్డులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు పాఠశాలలో అందజేయాలన్నారు. పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం ఎంపికలు ఉంటాయన్నారు. 7వ తరగతి స్టేట్ సిలబస్, 8,9, తరగతులు సెంట్రల్ సిలబస్ ఉంటాయన్నారు. విద్యార్థులు విషయాన్ని గమనించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సిద్దవటం ఇన్‌చార్జ్ ఎంఈవోగా విలియం రాజు బాధ్యతలు

సిద్దవటం, జూన్ 6: సిద్దవటం మండలం ఇన్‌చార్జ్ ఎంఈవోగా విలియం రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అట్లూరు మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జ్ ఎంఈవోగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

వాహన బాడుగలు ఇవ్వండి సారూ...

రైల్వేకోడూరు, జూన్ 6: నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల సమయంలో వాహనాలను అధికారులు వాడుకున్నారని.. అయితే ఎన్నికలు పూర్తి అయినా ఇంత వరకు వాహనాల బాడుగ డబ్బులు రాలేదని గురువారం రైల్వేకోడూరు తహసీల్దార్ శివరాముడుకు విన్నవించారు. వాహనాలను తామందరం ఫైనాన్స్ కింద తెచ్చుకున్నామని.. డబ్బులు ఇంకా ఇవ్వలేదని, ఫైనాన్స్ వారు వత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ శివరాముడు మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన నివేదికలు ఉన్నతాధికారులకు పంపామని వివరించారు.

వాహనాల వేలం పాటలో రూ. 97000 ఆదాయం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 6: లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడ్డ ద్విచక్రవాహనాలకు గురువారం వేలంపాట నిర్వహించారు. వేలం పాట ద్వారా రూ.97000 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎన్ ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

చిన్నమండెం, జూన్ 6: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలో సద్దలగుట్టపల్లె క్రాస్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో కృష్ణయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ముండ్లవాళ్లకోటకు చెందిన కృష్ణయ్య తన పొలం పనుల మీద ముండ్లవాళ్లకోట నుంచి కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై సద్దలగుట్టపల్లె క్రాస్ దాటుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కృష్ణయ్య గాయపడ్డాడు. 108 వాహనంలో రాయచోటి ఆసుపత్రికి తరలించారు.

కూటమి విజయంతో మొక్కుబడులు చెల్లింపు

ఓబులవారిపల్లె, జూన్ 6: ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా అరవ శ్రీధర్ గెలుపొందడంతో గురువారం టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు ముక్కావారిపల్లెలో వున్న సత్యమ్మ తల్లికి, అలాగే హైవేపై వున్న అంజనేయస్వామికి మొక్కులు తీర్చుకున్నారు. రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి సత్యమ్మ తల్లికి, అంజనేయ స్వామికి 108 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొర్లకుంటలో గంగమ్మ తల్లికి మొక్కుబడి చెల్లించారు. కొర్లకుంట గంగమ్మ దేవాలయంలో ముక్కా రూపానందరెడ్డి భార్య ముక్కా వరలక్ష్మి, వారి కోడళ్ళు, మిత్రులతో కలిసి పొంగుబాళ్లుపెట్టి 108 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



గంగమ్మ తల్లికి పొంగుబాళ్ళు వండుతున్న ముక్కా వరలక్ష్మి



రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడంతో మొక్కులు తీర్చుకుంటున్న పెమ్మాడపల్లి వాసి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లెలో వెలసిన ముత్యాలమ్మకు గురువారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతున్న సందర్భంగా, అలాగే రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలిచినందున పూజలు చేపట్టి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, వెంకటసుబ్బయ్య, కోటి, చంద్రబాబు పాల్గొన్నారు.

రాయచోటి: రాయచోటి ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్ర సాద్ రెడ్డి గెలుపొందడంతో గురువారం రాయచోటికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నారాయణరెడ్డి పట్టణంలోని షిరిడిసాయి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పెమ్మాడపల్లె సర్పంచ్ పల్లపు వాసు, మాజీ సర్పంచ్ బసయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో లక్కిరెడ్డిపల్లె హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సరోజారెడ్డి గురువారం గంగమ్మతల్లికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు.

గాలివీడు: రాయచోటి ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించడంతో మండలంలోని పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీల సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచ్ మహ మ్మద్‌రఫీ, స్థానిక టీడీపీ నాయకులు గురువారం తంబళ్లపల్లి మల్లయ్య కొండ మల్లికార్జునస్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

సంబేపల్లె: సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించడంతో గురువారం టీడీపీ కార్యకర్త ఉదయగిరి మల్లికార్జున స్థానిక నాయకులు అనుంపల్లె రాంప్ర సాద్‌రెడ్డితో కలిసి మొక్కుబడి తీర్చుకున్నారు. దుద్యాల గ్రామదేవత కొత్తపురమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కును తీర్చుకున్నట్లు తెలియజేశారు.

సుగవాసి కుటుంబ సభ్యులను కలిసిన మండిపల్లి

రాయచోటిటౌన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం సుగవాసి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు, ఆయన కుమారులు బాల సుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను మర్యాదపూర్వకంగా కలిసి వారిని సత్కరించారు. తన విజయానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారు రాంప్రసాద్‌రెడ్డిని శాలువాతో సత్కరించి రాయచోటి ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, మండిపల్లి సుగవాసి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడుతో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు ప్రజలకు రుణపడి ఉంటా..

గాలివీడు, జూన్ 6: తన సోదరుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మంచి మెజార్టీ తెచ్చిపెట్టిన గాలివీడు మండల ప్రజల రుణం తీర్చుకుంటామని రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గాలివీడులో పర్యటించిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన సోదరుడు గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేసిన కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రామాపురం, జూన్ 6: చిట్లూరు పంచాయతీ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుకను రాయచోటికి తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేతలకు సత్కారాలు, సన్మానాలు

రాజంపేట, జూన్ 6: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే అరవశ్రీధర్‌లను రాజంపేట టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. రూపానందరెడ్డి ఆధ్వర్యంలో అరవ శ్రీధర్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా వారికి పూల బుకేను అందజేశారు. టీడీపీ నాయకులు ఎస్‌వీ రమణ, లక్ష్మీనరసయ్య, గుగ్గిళ్ల చంద్రమౌళి, నాగరాజ, పలుకూరి రవీంద్ర, సుధాకర్‌బాబు, నామా హరిరాయల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయ చోటి ఎమ్మెల్యేగా ఎన్నికైన రాంప్రసాద్‌రెడ్డిని రాజంపేటి టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం రాయచోటికి వెళ్ళిన రాజంపేట మండల మాజీ ఉపా ధ్యక్షుడు నాగాసుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పలుకూరి రవీంద్ర, నామా హరిరాయల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



రూపానందరెడ్డిని, ఎమ్మెల్యే శ్రీధర్‌ను సత్కరిస్తున్న తాతంశెట్టి నాగేంద్ర తదితరులు



రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు



కడప ఎమ్మెల్యేను సత్కరిస్తున్న విజయశేఖర్‌రెడ్డి

సుండుపల్లె: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యంను కలిసినట్లు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఆనందనాయక్, మండల నాయ కులు అమృనాయక్‌లు తెలిపారు. గురువారం రాయచోటిలోని ఆయన స్వగృహంలో కలిసి పలు విషయాలను మాట్లాడినట్లు తెలిపారు. అలాగే రాయచోటి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సుండుపల్లె మండలానికి చెందిన టీడీపీ నాయకులు దామోదర్‌నాయుడు, చిట్టెం రామచంద్ర, యర్రంరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఆనంద్‌నాయక్, టీడీపీ సీనియర్ నాయకులు అమృతనాయక్, జయరాం నాయక్, మాజీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, శివారెడ్డి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నందలూరు : టీడీపీ కడప ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన రెడ్డప్పగారి మాధవిరెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో గురువారం సత్కరించారు. ఈయన వెంట టీడీపీ నాయకులు నరసయ్య, సుబ్బరాయుడు, రాము తదితరులు ఉన్నారు.

సిద్దవటం: కడప ఎమ్మెల్యేగా విజయం సాధించిన రెడ్డప్పగారి మాధవిరెడ్డిని కడప జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య గురువారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎన్‌డీఏ కూటమి నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా అరవ శ్రీధర్‌ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి వుంటామని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవశ్రీధర్‌ను వారి ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శాలువాకప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఓబులవారిపల్లె మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీయూడబ్ల్యుజే నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 6: నూతనంగా ఎన్నికైన రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీయూడబ్ల్యుజే అన్నమయ్య జిల్లా కన్వీనర్ గౌనుపల్లె శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టులకు అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. ఈ విషయంపై ఆయన స్పందిస్తూ త్వరలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కార్యాచరణ రూపొంది స్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు సూర్యప్రకాశ్‌రాజు, శివ, మస్తాన్, వెంట్రామరాజు, తాతయ్య, రమేశ్‌రాజు, అంజి, ప్రవీణ్‌కుమార్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకునికి డాక్టరేట్

రాజంపేట టౌన్, జూన్ 6 : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు షేక్ ముక్తియార్ అలీకి అనంతపురం జయంతి విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అన్నమాచార్య కళాశాలలో ఈఈఈలో పని చేస్తున్న ముక్తియార్ అలీ విద్యుత్‌పై నష్టాలను తగ్గించే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. ముక్తియార్ అలీని కళాశాల అధినేత చొప్పా గంగిరెడ్డి, ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణలు అభినందించారు.

అభివృద్ధి కోసం వెనకడుగు వేసేదే లేదు : ఎమ్మెల్యే

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 6: కోడూరు అభివృద్ధి కోసం వెనకడుగు వేసేదే లేదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్క రూపానందరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ప్రధాన రహదారి మధ్యలో గత ప్రభుత్వంలో ఏర్పా టు చేసిన భారీకేడ్లను పరిశీలించారు. కొంతమంది రాజకీయ నాయకులు, అధికారులు వారి స్వార్థం కోసం భారీకేడ్లను ఏర్పా టు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఎన్నిసార్లు అధికారులకు స్థానికులు మొర పెట్టుకున్న ఫలితం లేదన్నారు. ముఖ్యంగా చిట్వేలి, ప్రభుత్వ ఆసుపత్రికి పోవడానికి చాలా దూరం వెళ్లి యూటర్న్ తీసుకునే పరిస్థితి. ఈ సమస్యపై టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ స్పందించి అక్కడి వెళ్లి వెంటనే భారీకేట్లను తొలగించాలని స్థానిక అధి కారులను ఆదేశించారు. ప్రజల అవసరాల కోసం కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, యువ నాయకులు పోతురాజు నవీన్ కుమార్, మైనారిటీ నాయకులు పట్టాన్ మౌలా, బాలిశెట్టి హరిక్రిష్ణ రాయల్, జనసేన మరియు టీడీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బారికేడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ టీడీపీ ఇన్‌చార్జ్ రూపానంద రెడ్డి

టీడీపీ విజయం పట్ల న్యాయవాదుల సంబరాలు

రాజంపేట, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. గురువారం రాజంపేట లీగల్‌సెల్ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటు లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ముందుగా ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, యువకులు, విద్యావంతులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల వారు జగన్ నియంత పాలనను ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. అపార అనుభవం కలిగిన చంద్ర బాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం గర్వకారణమన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం, మెడికల్ కళాశాల ఏర్పాటు, అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మా ణం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సింగంశెట్టి కృష్ణకుమార్, పలుకూరి రామాంజనేయులు, కత్తి సుబ్బ రాయుడు, కందుల వెంకటరమణ, వెంకటస్వామి, ప్రభాకర్‌నాయుడు, మల్లికార్జున, అక్షయ కుమార్, చంద్ర, చైతన్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం ఇవ్వాలి

రాయచోటిటౌన్, జూన్ 6: మున్సిపల్ క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనంగా రూ.18500లు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన క్లాప్ డ్రైవర్లతో కలిసి రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గత ఏడాది డిసెంబర్ లో 16 రోజుల సమ్మె చేయగా గత ప్రభుత్వం దిగొచ్చి క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం ఇవ్వాలని జీవో ఇచ్చినప్పటికీ రాయచోటి మున్సిపాలిటీలో ఆ జీవో అమలు కాలేదన్నారు. కొందరికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, డ్రైవర్లను ఆప్కా స్‌లో స్వీపర్‌లుగా చూపించిన కారణంగా రూ.24500లు వేతనం పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇవ్వాల్సిన బోనస్ రూ.1000 కూడా ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని కమిషనర్ ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు, బీవీ రమణ, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

బీఎల్‌ఓలకు వేతనాలు ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 6: సార్వత్రికల ఎన్నికల్లో నిరంతరం సేవలు అం దించిన బూత్‌స్థాయి అధికారులు, బీఎల్‌ఓలకు వెంటనే గౌరవేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీని వాసులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్నకు బీఎల్‌ఓలతో కల సి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా గత రెండేళ్లుగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సవరణ నుంచి ఓటర్ల తుది జాబితా వరకు పనిచేసిన బీఎల్‌ఓలకు ఎన్నికలు అయిపోయిన కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వారికి రావాల్సిన జీతబత్యాలు ఇంతవరకు ఇవ్వకపోవ డం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీఎల్ ఓలకు గౌరవవేతనం ఇవ్వాలని వారు కోరారు.

ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు పెంచండి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 6: లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ సెంటర్లలో పెరటి మొక్కలు పెంచాలని సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పందిళ్లపల్లె పంచాయతీలోని తాటిమాకులపల్లె అంగన్వాడీ సెంటర్‌లో పెరటి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు. సెంటర్ పరిధిలో కూరగాయ మొక్కలు, టమోటా, వంగ, చిక్కుడు, పచ్చిమిరప, బెండ వంటి కాయగూర మొక్కలు నాటు కుంటే మంచిదని.. వీటితోనే పిల్లలకు మంచి ఆకుకూరలు వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ దాద్‌బీ, హైమావతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

చిన్నమండెం, జూన్ 6: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో మనమంతా భాగస్వామ్యమై క్షయ వ్యాధి లేని భారతదేశ నిర్మాణంలో పాల్గొనాలని టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ రియాజ్ పిలుపునిచ్చారు. గురువారం టీకా వేసే సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ వయోజనుల బీసీజీ ఈకా సురక్షితం అని, ఎటువంటి అపోహలు లేవని ప్రతి ఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకుని క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందాలన్నారు. కార్యక్రమంలో చాకిబండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడి నుంచి దుప్పిని కాపాడిన గ్రామస్థులు

సిద్దవటం, జూన్ 6 : మండలంలోని టక్కోలు గ్రామ పంచాయతీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం ఎదురుగా వున్న మామిడి చెట్లలోకి అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి వన్యప్రాణి పొడదుప్పి రావడంతో కుక్కల దాడి చేసి గాయపరిచాయి. గమనించిన గ్రామస్తులు దుప్పిని కాపాడి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఫారెస్టు సిబ్బందికి అప్పగించారు. గాయపడిన వన్యప్రాణిని ప్రథమ చికిత్స కోసం వెటర్నరీ వైద్యశాలకు తరలించారని తెలిపారు. కాగా, గతంలో కూడా ఈ ప్రాంతాల్లో పలుమార్లు వన్యప్రాణులు ప్రమాదాలకు గురయ్యాయని, అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపాలిటీలో అవకతవకలపై విచారణ చేపడతాం

రాయచోటిటౌన్, జూన్ 6: గత ప్రభుత్వ హయాలో రాయచోటి మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపడతామని మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సల్లావుద్దీన్ అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని తన కారాయలయంలో విలేకరుల సమావేశంలో మట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన చూసి ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించారన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో పన్నుల పేరుతో అధికంగా వసూలు చేశార్నారు. మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతామన్నారు. భూగర్భ డ్రైనేజీ పనులు 20 శాతం కూడా పనులు పూర్తి కాకుండా అంతా ఊరు బయట పనులు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆసివుల్లాఖాన్, టీడీపీ నాయకులు వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం కోసం పాటు పడిన వారికి ధన్యవాదాలు

నందలూరు, జూన్ 6: ఎన్‌డీఏ కూటమి విజయం కోసం పాటు పడిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు బీజేపీ తరుపున ధన్యవాదాలని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ అరిగే రాంప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి మరచిపోలేని అఖండ విజయాన్ని ఇచ్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన రాక్షస పాలనకు చరమగీతం పాడుతూ 164 ఎమ్మెల్యే, 21 ఎంపీ స్థానాలతో అద్భుత విజయాన్ని కూటమికి అందజేశారన్నారు. దురదృష్టవశాత్తు రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం ఓడిపోయ్యారన్నారు. దానికి గల కారణాలను విశ్లేషించుకుంటా మన్నారు.

ఆర్టీసీ పరిసరాలు పరిశుభ్రత

చిట్వేలి, జూన్ 6: అపరిశుభ్రతగా వున్న చిట్వేలి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని గురువారం ఆర్టీసీ అధికారులు శుభ్రపరిచారు. ఆర్టీసీ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడం, పిచ్చి మొక్కలు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా వున్న పరిస్థితిని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. దీంతో స్పందించిన అధికారులు ఆర్టీసీ రక్షణ అధికారి సంజీవరావురాయుడు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేసి బస్సుల రాకపోకలకు వీలు కలిగించామని తెలిపారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నామినేటెడ్ పదవులకు పలువురి రాజీనామా



రాజీనామా చేస్తున్న ఎంబీ కుమార్ రాజా

బంగారుపాళ్యం, జూన్ 6: రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబీ కుమార్ రాజా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈయనతో పాటు రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలేశ్వర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్‌నాథ్ తమ రాజీనామాలను బీసీ వెల్ఫేర్ చీఫ్ సెక్రటరీకి పంపినట్లు తెలిపారు.

జానపద కళల అకాడమీ ఛైర్మన్ కూడా..

పుంగనూరు: పుంగనూరుకు చెందిన రాష్ట్ర జానపదకళల అకాడమీ ఛైర్మన్ కె.నాగభూషణం గురువారం తన పదవికి రాజీనామా చేశారు. రెండు పర్యాయాలు ఈపదవిలో కొనసాగిన ఆయన.. వైసీపీ అధికారం కోల్పోవడంతో రాజీనామా చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ పదవికి రహంతుల్లా అలియాస్ అమ్ము, ముడా ఛైర్మన్ పదవికి ఎన్.వెంకటరెడ్డి యాదవ్ కూడా రాజీనామాలు చేశారు.

టీడీపీ వారిపై వైసీపీ శ్రేణుల దాడి



చికిత్స పొందుతున్న శీనప్ప

కుప్పం, జూన్ 6: గుడుపల్లె మండలంలో టీడీపీ కార్యకర్త, అతడ కోడలిపై వైసీపీ శ్రేణులు గురువారం దాడిచేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు... సోడిగానిపల్లె పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త శీనప్ప, ఆయన కోడలు కవితపై గురువారం వైసీపీ కార్యకర్తలు అకారణంగా దాడిచేసి తీవ్రంగా కొట్టారు. గాయాల పాలైన వీరిద్దరినీ బంధువులు చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న శీనప్పను టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, సభ్యులు కన్నన్, మునస్వామిలు పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, దాడికి కారకులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

టీడీపీ నేతలపై దాడిలో ఆరుగురిపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె, జూన్ 6: బైరెడ్డిపల్లె మండలం పాతపేటలో మంగళవారం రాత్రి విజయోత్సవాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వైసీపీకి చెందిన సర్పంచి మమత, ఆమె భర్త రవిచంద్రతో పాటు మరో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు అజిత్‌కుమార్, రాజేష్‌ను వైసీపీకి చెందిన రవిచంద్ర అడ్డగించి దూషించి దాడిచేసినట్లు చెప్పారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళుతున్న టీడీపీ నేత సుబ్రమణ్యంశెట్టిపై కూడా రవిచంద్ర దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ మేరకు సుబ్రమణ్యంశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీసీ విద్యార్థినికి ఎస్సీ సర్టిఫికెట్

- దరఖాస్తు చేయకున్నా జారీ చేసిన పుంగనూరు తహసీల్దారు
- రద్దు చేసి విచారించాలంటూ విద్యార్థిని తండ్రి ఫిర్యాదు


COMMUNITY, NATIVITY & DATE OF BIRTH CERTIFICATE

రమ్యసాయికి తహసీల్దారు మంజూరు చేసిన ఎస్సీ కులధృవీకరణ పత్రం - రమ్యసాయి బీసీ కులానికి చెందినదిగా పేర్కొన్న పాఠశాల టీసీ

పుంగనూరు, జూన్ 6: కుల ధ్రువీకరణ పత్రం కావాలని వాళ్లు దరఖాస్తు చేయలేదు. కానీ, బీసీ కులానికి చెందిన విద్యార్థినికి ఎస్సీ కులధ్రువీకరణ పత్రాన్ని పుంగనూరు తహసీల్దార్ జారీ చేశారు. తప్పుడు సర్టిఫికెట్ మంజూరుపై విచారించి.. రద్దు చేయాలని విదార్థిని తండ్రి, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ కార్యదర్శి ఎం.శ్రీకాంత్ అధకారులను కోరారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు కుమ్మరవీధికి చెందిన ఎం.శ్రీకాంత్ కుమార్తె ఎం.రమ్య సాయి ఉన్నత చదువుల కోసం అగముడియన్ (మొదలియార్ బీసీ-డీ) కులం సర్టిఫికెట్ మంజూరు చేయాలని గురువారం స్థానిక 5వ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేశారు. అక్కడి సిబ్బంది వీరికి నివ్వెరపోయే సమాధానం ఇచ్చారు. 2023 మార్చి 5వ తేది పుంగనూరు తహసీల్దార్ టీ.సీతారాం ఎం.రమ్యసాయి స్థానిక మేలుపట్లలో ఇంటినెంబరు 27/57/18లో కాపురమున్నట్లు, వారు అరవమాల ఎస్సీ-సీ కులానికి చెందినవారిగా.. 2007 మే 1వతేదీ జన్మించినట్లు 1వ సచివాలయంలో సర్టిఫికెట్ మంజూరైనట్లు పేర్కొన్నారు. అయితే శ్రీకాంత్ రెండో కుమార్తె రమ్యసాయి జన్మదినం 2002 జనవరి 25, కులం బీసీ-డీగా స్కూల్ సర్టిఫికెట్ చూపి వెంటనే తన కుమార్తె కులధృవీకరణ పత్రం ఎస్సీ-సీని రద్దు చేసి బీసీ-డీగా ఇవ్వాలని తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేశారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఏదైనా ఉద్దేశ్యపూర్వకంగా చేశారా, లేక పొరబాటు జరిగిందా అనే విషయంపై విచారించి తప్పును సరిదిద్దాలని కోరారు.

ఆగని గజదాడులు



పంట నష్టాన్ని చూపుతున్న రైతు వేముల ప్రకాశ్

సదుం, జూన్ 6: సదుం మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో ఆగని గజరాజుల సంచారంతో వాటిల్లుతున్న పంట నష్టంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి చెరుకువారిపల్లె పంచాయతీ పోతంవారిపల్లె సమీపంలోని వేముల ప్రకాశ్‌కు చెందిన టమోటా పంట పొలాలపై ఏనుగులు సంచరించాయి. ఆ పంటను తొక్కి వేసి కోతకొచ్చిన పంటను నాశనం చేశాయి. ఫారెస్టు బీట్ ఆఫీసర్ మహేశ్, నలుగురు ట్రాకర్ల సాయంతో సంఘటనా స్థలానికి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించారు. గజరాజుల అడుగు జాడలు గుర్తిస్తూ బంగారు చింత అడవి వైపుగా వాటిని దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అటవీ శివారు ప్రాంతాల్లో పంట పొలాలపై తరచూ ఏనుగుల దాడులు తీరనిసమస్యగా మారిందని రైతులువాపోతున్నారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో తనిఖీలు



బొమ్మసముద్రం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీఆర్ఎస్ మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 6: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ మాధవి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. రేణిగుంటలో ఉదయం బయల్దేరి తిరుపతి, పాకాల, చిత్తూరు మీదుగా దక్షిణ మధ్య రైల్వే సరిహద్దులో ఉన్న బొమ్మసముద్రం స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో రైళ్ల రాకపోకలు, భద్రత అంశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాకాల రైల్వే యార్డ్‌లోని 62వ ఎల్‌సీ గేటు నిర్వహణ తీరును పరిశీలించి, ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముంగిలపట్టు-చంద్రగిరి రైల్వే స్టేషన్ల మధ్య వున్న వంతెనను తనిఖీ చేసిన అనంతరం తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలిస్తారు. అనంతరం సికింద్రాబాద్ వెళతారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు సుధాకర్, లక్ష్మీనాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సురేష్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

భానుపై దాడుల ఫలితమేనా భారీ ఆధిక్యత?

- రోజా ఓటమే లక్ష్యంగా కసితీరా పనిచేసిన టీడీపీ కేడర్



భానుప్రకాష్‌పై దాడికి పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కేడర్‌ను అదుపు చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, జూన్ 6: ఐదేళ్లు... నియోజకవర్గంలో రూల్ ఆఫ్ లాకు పాతరేశారు.... పోలీసు స్టేషన్లను అధికార పార్టీకి గెస్ట్ హౌస్‌లుగా మార్చుకున్నారు... ఏకంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌పై భౌతిక దాడికి పాల్పడే స్థాయికి బరితెగించారు... ఫిర్యాదు చేస్తే తిరిగి రివర్స్ కేసులతో వేధించారు. దౌర్జన్యాలు, దాడులతో అరాచకాన్ని సృష్టించారు. దీంతో కడుపు రగిలిన టీడీపీ కేడర్ రోజా ఓటమికి కసితీరా పనిచేశారు. దీని ఫలితమే రికార్డు మెజార్టీ అని భావిస్తున్నారు.

రోజా ఓటమికి తొలి నాంది

గతేడాది అక్టోబర్‌లో నగరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గాలి భానుప్రకాష్‌ను వైసీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో అడ్డగించారు. భౌతికదాడికి యత్నించారు. ఈ క్రమంలో కారు ధ్వంసమైంది.డ్రైవర్ విజ్ఞతతో వ్యవహరించడంతో ఆయన తప్పించుకున్నారు. దీంతో టీడీపీ కేడర్ అప్పటికప్పుడు భానుప్రకాష్‌కు మద్దతుగా నగరి వచ్చి భారీ ర్యాలీతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు తిరిగి ఆయనపైనే కేసు నమోదు చేశారు. దీనిపై పుత్తూరులో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లాఠీలతో విరుచుకుపడ్డారు.

ఏకంగా 13 కేసులు

2019లో అధికారంలోకి వచ్చాక వైసీపీ కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తించింది. భానుప్రకాష్ టార్గెట్‌గా పోలీసు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేంది. ఈ ఐదేళ్లలో పుత్తూరు, నగరి పరిధిలో 13 కేసులు నమోదు చేయించింది. ఎన్నికలయ్యాక కూడా పుత్తూరులో కేసు నమోదు చేశారంటే పోలీసు అధికారుల ఏకపక్ష తీరుతెలుస్తోంది. గతేడాది చంద్రబాబునాయుడు అరెస్ట్ సందర్భంగా నిరసన తెలిపేందుకు కూడా అనుమతివ్వలేదు. తిరుపతి నుంచి పుత్తూరుకు చేరుకునేందుకు నానా అవస్థలూ పడ్డారు.

కసి తీరా పనిచేసిన కేడర్

వరుసగా కార్యకర్తలు, నాయకులతో పాటు గాలి భానుప్రకాష్‌పై కూడా కేసులు, అణచివేతలతో వ్యవహరించిన రోజాను ఓడించేందుకు కేడర్ ప్రతిజ్ఞ పూనేలా చేసింది. శపథాలను పక్కన పెట్టారు. వైసీపీ కేడర్‌ను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచి తామే అభ్యర్థి అనేలా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల రోజుకు ముందు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో శ్రమించి పనిచేశారు. ఫలితంగా నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు లేని విధంగా 45,004 ఓట్ల మెజార్టీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. అధికారం తెచ్చిన అహంకారంతో విచ్చలవిడిగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా భారీ మూల్యమే చెల్లించిందనే మాటలు వినబడుతున్నాయి.

తప్పుకుంటే సరి.. లేదంటే వేటే !

- డీసీసీబీ, సీడీసీఎంఎస్ కమిటీలకు త్వరలో మంగళం
- ఐదేళ్లుగా ఎన్నికలు లేకనే కొనసాగుతున్న పాలకవర్గాలు
- నెలాఖరుతో ముగియనున్న విండోల త్రిసభ్య కమిటీల పదవీకాలం



రెడ్డెమ్మ - నాగలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 76 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (సింగిల్ విండో)ల నామినేటెడ్ త్రిసభ్య కమిటీల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)ల సెవెన్‌మెన్ కమిటీలకు వచ్చే నెల 17తో నామినేటెడ్ పదవీకాలం పూర్తికానుంది. కమిటీల పేరిట తన పార్టీ వారికే పదవులు అంటగట్టి ఆరునెలలకోసారి పొడిగిస్తూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పాలకవర్గాల ఎన్నికల ఊసే లేకుండా చేసింది. కొత్త ప్రభుత్వం కొలువుతీరి వేటు వేసేలోగా ఈ కమిటీలు వెంటనే తప్పుకుంటే గౌరవంగా ఉంటుందని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గానికి చెందిన ఎం.రెడ్డెమ్మ డీసీసీబీ సెవెన్‌మెన్ నామినేటెడ్ కమిటీకి... సీడీసీఎంఎస్‌కు ఎస్.నాగలక్ష్మి ఛైర్‌పర్సన్లుగా కొనసాగుతున్నారు. ఇదేవిధంగా 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీ ఛైర్మన్లుగా, ఇద్దరు సభ్యులుగా వున్న 228 మంది వైసీపీ మండలస్థాయి నేతలే ఉన్నారు. ప్రస్తుతం వీరి హయాంలో ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారు. కోట్లాది రూపాయలు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. రుణాల పేరిట తమ పార్టీ వారికి నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక నిధులు మంజూరు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎన్నికలకు ఎందుకు వెళ్ళలేదో...?

2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగియడంతో వాటి గడువును ఒక ఏడాది పొడిగించింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల జోలికి వెళ్లకుండా సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు, డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు సెవెన్‌మెన్ కమిటీలు వేసి, వాటి గడువును ప్రతి ఆరునెలలకోసారి పొడిగిస్తూ వచ్చింది. ఎన్నికలు జరగకపోవడంతో మూడు లక్షల మంది రైతుసభ్యులు ఓటువేసే హక్కు కోల్పోయారు. ఐదేళ్ల కాలంలో పాలకవర్గాలు లేని సహకార సంఘాలుగా అవి నిలిచాయి.

వెనుకబడ్డ సంఘాలు

సింగిల్ విండోలు, సీడీసీఎంఎస్, డీసీసీబీ పాలకవర్గాలు ఎన్నికై ఉంటే ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి రుణపరపతి పెంచుతూ బ్యాంకుల్లో డిపాజిట్లు ఎలా చేయాలి? రైతులకు సహకార సంఘాల ద్వారా ఎలా చేయూతనివ్వాలి? ఆదాయం ఎలా పెంచాలనే నిర్ణయాలు తీసుకునేది. అవేవీ లేకుండానే ఐదేళ్లలో కమిటీతో చేయూతనిచ్చే సహకార సంఘాలకు ఊతమే లేకపోయింది. అన్నింటిలాగే సహకార సంఘాలనూ వైసీపీ ప్రభుత్వం ముంచేసింది. ఐదేళ్లలో సహకార సంఘాలు రైతులకు సహకారం అంతంతగానే ఉండడంతో పాటు సంఘాలూ అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయాయి.

చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును చంద్రగిరి మండలానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధర రావు గురువారం ఉండవల్లిలోని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎన్నికల కురుక్షేత్రంలో మరెవ్వరికీ సాధ్యం కాని అద్భుత విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీవారి ఆలయం మీదుగా విమానం



ఆలయంపై వెళుతున్న విమానం

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా మరోసారి విమానం ప్రయాణించడం విమర్శలకు దారితీసింది. శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆలయంపై విమానాలు ప్రయాణించడం ఆగమశాస్త్ర విరుద్ధం. ఈ అంశంపై ఇప్పటికే అర్చకులు పలుమార్లు చెప్పినప్పటికీ తిరుమల క్షేత్రం మీదుగా తరచూ విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం 8.15 గంటలకు ఓ విమానం క్షేత్రం మీదుగా ప్రయాణించింది. భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు విమానాలు ప్రయాణించకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. కేంద్రంతో మరోసారి ఈ అంశంపై చర్చించి విమానాలు తిరుమల క్షేత్రంపై రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళను కట్టేసి దోపిడీ

వెంటాడి దుండగుల్లో ఒకడిని పట్టుకున్న గ్రామస్తులు ● 40 గ్రాముల చైను, రూ.1.3 లక్షల నగదు అపహరణ



బాధితురాలు షర్మిల - పోలీసుల అదుపులో నిందితుడు

శాంతిపురం, జూన్ 6: ఒంటరి ఇంట్లోకి ఆరుగురు దుండగులు చొరబడ్డారు. మహిళపై దాడిచేసి.. కాళ్లు చేతులు కట్టేసి మెడలోని బంగారు చైను, రూ.1.3 లక్షల నగదు, ఒక ద్విచక్రవాహనం తీసుకెళ్లారు. గ్రామస్తులు వెంటాడటంతో ఒక దుండుగుడు దొరికాడు. శాంతిపురం మండలం తోపుచేను గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు షర్మిల తెలిపిన ప్రకారం.. తోపుచేను గ్రామానికి చెందిన యువరాజు అలియాస్ పళని తమ పొలాల వద్ద ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా యువరాజు సింగపూరులో ఉన్నారు. ఆయన భార్య షర్మిల, కుమార్తెలు కావ్య, మనుప్రియ, కుమారుడు తనీష్ ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కుమార్తె ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఉండగా, మరో కుమార్తె తమిళనాడులోను, కుమారుడు తిరుపతిలో చదువుతున్నారు. కళాశాలలకు సెలవులు కావడంతో వాళ్లు ఇంటికి వచ్చారు. ఎప్పటిలాగే ఇంటి ప్రహరీ గేటుకు తాళాలువేసి ద్విచక్రవాహనం తాళాలను అందులోనే ఉంచి బయట పెట్టారు. తనీష్ మిద్దెపైన గదిలో ఉన్నారు. అర్ధరాత్రి తలుపు తట్టిన శబ్దం వినపడటంతో తనీష్ అనుకొని షర్మిల తలుపులు తీశారు. ముఖానికి ముసుగులు, చేతులకు గ్లౌజులు ధరించిన ఆరుగురు దుండుగులు ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. ఆమె మెడ పట్టుకుని నోట్లో గుడ్డ కుక్కి కాళ్ళు చేతులు కట్టేశారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆమెపై దాడి చేశారు. కత్తులు, రాడ్లతో బెదిరించారు. ఆమె మెడలోని 40 గ్రాముల బంగారు చైను, తాళి బొట్టు లాక్కొన్నారు. బీరువాలోని రూ.1.30 లక్షల నగదు తీసుకున్నారు. దుండగులు చేస్తున్న శబ్దానికి రూములో నిద్రిస్తున్న మనుప్రియ లేచి చూశారు. దుండగులను చూసి భయంతో గదిలోకి వెళ్లి లాక్ చేసుకున్నారు. దుండగులు కూడా ఆమె గది బయట గడి పెట్టారు. వెంటనే ఆమె మిద్దెపైన ఉన్న తనీష్‌కు ఫోను చేశారు. అతడు కిందికి వచ్చేసరికి వారి ద్విచక్రవాహనాలతో పాటు షర్మిల స్కూటీని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఇంట్లో దొంగలు పడ్డారంటూ తనీష్ గట్టిగా కేకలు వేశారు. రాళ్లబూదుగూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఇతడు కేకలు విన్న చుట్టుపక్కల బంధువులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. వీరంతా ద్విచక్ర వాహనాల్లో దుండగులను వెంబడించారు. కొంత దూరం వెళ్లిన దుండగులు తలా ఒక దిక్కున వెళ్లిపోయారు. గ్రామస్తులూ అన్ని వైపులా వెళ్లారు. ఆరుగురు దుండగుల్లో ఒక్కడు దండికుప్పం సబ్ స్టేషన్ వద్ద పట్టుబడ్డాడు. రాళ్లబూదుగూరు ఎస్‌ఐ సుమన్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దుండగుడి వద్ద బ్యాగులోని పెద్ద పెద్ద రాడ్లు, కత్తులు, బీరువాలు, తలుపులు తెరిచే రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దుండగుల దాడిలో గాయపడిన షర్మిలను ఆస్పత్రికి తరలించారు. గురువారం కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ సుమన్ తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం చిత్తూరు క్లూస్ టీం వెళ్లి వివరాలు సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తుమ్మలగుంట చెరువులో హడావుడి నిర్మాణాలు

ఎన్జీటీ అభ్యంతరాలున్నా మారని తీరు



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో హడావుడిగా నిర్మాణాలు జరుగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏవియేషన్ అనుమతులు లేకుండా చెరువులో నెలరోజుల క్రితం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన జాతీయ పతాకం కోసం ఐప్యాక్ టీం హెడ్ చేతుల మీదుగా భూమిపూజ చేశారని విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో పతాకాన్ని తీసి.. పక్కన పెట్టినట్టు తెలిసింది. అయితే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పతాక స్తంభం చుట్టూ నిర్మాణాలు జరుగుతున్నాయి. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఎన్జీటీ అభ్యంతరాలు, మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలోనూ తుమ్మలగుంట చెరువులో మాత్రం నిర్మాణాలు మాత్రం ఆగకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

31 మండలాల్లో భారీ వర్షం



జలమయమైన చిత్తూరు నగరంలోని పలమనేరు రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు రామకుప్పం మినహా మిగిలిన 31 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. రొంపిచెర్లలో 41.4మి.మీ, యాదమరి 35.0, చిత్తూరు అర్బన్ 34.0, చౌడేపల్లె 30.2, బంగారుపాళ్యం 27.2, బైరెడ్డిపల్లె 26.8, చిత్తూరు రూరల్ 26.2, పాలసముద్రం 22.6, గంగాధరనెల్లూరు 20.0, తవణంపల్లె 18.6, పెద్దపంజాణి 18.4, వెదురుకుప్పం 17.2, నింద్ర 15.2, గుడుపల్లి 15.2, సోమల 14.2, గంగవరం 13.4, కార్వేటినగరం 13.2, పలమనేరు 11.6, పూతలపట్టు 10.5, గుడిపాల 9.8, కుప్పం 8.4, ఐరాల 8.2, సదుం 7.2, నగరి 6.8, పుంగనూరు 6.2, విజయపురం 3.2, పెనుమూరు 2.2, శాంతిపురం 2.2, శ్రీరంగరాజపురం 2.0, వి.కోట 2.0, పులిచెర్లలో 1.0 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

చిత్తూరు కల్చరల్: చిత్తూరు నగరంలో గురువారం మధ్యాహ్నం 3.45నుంచి 5.30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కలెక్టరేట్ ప్రధాన భవనం ముందు లాన్‌లో నీరు చేరింది. నీవానదిలోని లోతట్టు ప్రాంతాలకు నీళ్లు ప్రవహించడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. గిరింపేట వళ్లియప్పనగర్, ఓటి చెరువు, కృష్ణానగర్ ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. దొడిపల్లె షుగర్ ఫ్యాక్టరీ ఫ్లైఓవర్ పైన, కింద నడుములోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

కాణిపాకంలో వాన

ఐరాల(కాణిపాకం): కాణిపాకంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. స్వామి దర్శనం చేసుకున్న భక్తులు బస్టాండుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కొందరు దుకాణాలు, అన్నదానం సత్రం వద్ద తలదాచుకున్నారు.

తిరుపతిలో సీఈవో



ముఖేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ముఖేష్‌కుమార్‌మీనా తిరుమల శ్రీవారిని దర్శించుకుని విజయవాడకు తిరుగుప్రయాణం కానున్నారని జిల్లా అధికారులు తెలిపారు.

క్యాన్సర్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

మదనపల్లె టౌన్, జూన్ 6: మానవశరీరంలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడంలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక జీటీహెచ్ ఆవరణలోని డీఐఈసీ భవనంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ నివారణ శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలోని పలువురు వైద్యులకు క్యాన్సర్‌నివారణ, లక్షణాల గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వైద్యులు జిల్లాలోని అన్ని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల వైద్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. వారందరు కలసి ఈనెల 11వ తేదీ నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, సీహెచ్‌వోలకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా పట్టణాలు, గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ లక్షణాల గుర్తింపుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీడీ ప్రొగ్రామ్ అధికారి శివప్రసాద్, డాక్టర్ ఎంస్ రాజు, జమున, అంకాలజి యూనిట్ నోడల్ అధికారి సౌమ్యపల్లవి, రీసోర్సుపర్సన్‌లు మల్లీశ్వరి, కీర్తి, మమత, జాహ్నవి, ముబీనా పాల్గొన్నారు.

పోలీసులు శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి



పెద్దమండ్యంలో పర్యటించిన డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పెద్దమండ్యం, జూన్ 6: పోలీసులు శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. గురువారం పెద్దమండ్యం మండలంలోని. పెద్దమండ్యం, కలిచెర్ల, సిద్దవరం, తురకపల్లి, వెలిగల్లు తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయని పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ చేయాలని సూచించారు. అపరిచితులు సంచారం తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సందర్భంగా అవాంచనీయ సంఘటనలు జరగకుండ ఎన్నికలు ప్రశాంతగ జరగడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ వెంట ములకలచెరువు సీఐ మధు, ఇన్‌చార్జ్ ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐలు ఇసాక్, మధుసూధనాచారి పోలీసు సిబ్బంది ఉన్నారు.

భూతగాదాలో ఇద్దరిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూన్ 6: భూతగాదాలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అగ్రహారం పంచాయతి బండమీదమాలపల్లి చెందిన రామాంజులు, నాగరాజ కలసి మదనపల్లి మండలం సుబ్రమణ్యంకు చెందిన భూమిని గుత్తకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో రామాంజులు సక్రమంగా వ్యవసాయం చేయక పోవడంతో సుబ్రమణ్యం మెత్తం భూమిని నాగరాజకు అప్పగించాడు, దీంతో నాగరాజ ఉన్న పొలాన్ని దున్నుతుండగా అన్న రామంజులు(50). అతని కుమారుడు సాయి(22)లు వచ్చి కర్రతో తమ్ముడైన నాగరాజ, తండ్రి అయిన గంగయ్యపై దాడిచేసి గాయపరిచారు. దీంతో నాగరాజ పిర్యాదు మేరకు రామాంజులు, సాయిపై కేసు నమోదు చేసినట్లు అయన తెలిపారు.

మొరాయించిన సర్వర్.. ఇబ్బంది పడ్డ రైతన్నలు

బి.కొత్తకోట, జూన్6: గ్రామ, వార్డు సచివాలయాలు, మీ-సేవా కేంద్రాలలో గురువారం సర్వర్ మొరాయించడంతో రెవెన్యూ సర్వీసులు స్తంభించి రైతన్నలు ఇబ్బందిపడ్డారు. ఏపీ ఆన్‌లైన్ సర్వీసులు మాత్రం పనిచేసి, మీ-సేవ పోర్టల్ ఓపెన్ కాకపోవడంతో 1-బి, అడం గల్ ఇవ్వడానికి వీలు లేకుండా పోయిందని మీ-సేవ ఆపరేటర్లు తెలిపారు. దీంతో పంట రుణాల రెన్యువల్ కోసం రైతులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. తమ భూములకు సంబం ధించిన అన్ని సర్వేనెంబర్లు, ఆ నంబర్లలోని భూ విస్తీర్ణంతో కూడిన ఆన్‌లైన్ 1-బి ఉం టేనే పంట రుణం రెన్యువల్ చేస్తామని బ్యాంకు సిబ్బంది స్పష్టం చేయడంతో రైతులు రెవెన్యూ అధికారుల వద్దకు పరుగులు తీశారు. మీ-సేవ 1-బి కాకుండా, మీ-భూమి పోర్టల్‌లో ప్రింట్ తీసుకుని రెవెన్యూ అధికారుల సంతకాలు చేయించి బ్యాంకుల్లో ఇచ్చా రు. గడువులోగా రెన్యువల్ చేయకుంటే అపరాధం పడటంతో పాటు, వడ్డీరాయితీ కోల్పోయే పరిస్థితి ఉండటం తో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

షర్మిల నాయకత్వంతో కాంగ్రెస్ పుంజుకుంది

మదనపల్లె అర్బన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో ఆ పార్టీ పుంజుకుందని పార్టీ మదనపల్లె రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమికి ప్రజలు అధిక మెజార్టీ అందించారన్నారు. ఇందుకు కారణం వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలే అని తెలిపారు. రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైనా మదనపనల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చలపతి, హరినాథ్‌నాయుడు, టి.రెడ్డెప్పరెడ్డి రఘునాయక్ పాల్గొన్నారు.

నిరుపేదల ఇంట విద్యాకుసుమాలు

జాతీయ ఉపకారవేతనాలకు మదనపల్లె మున్సిపల్ పాఠశాల నుంచి 25 మంది విద్యార్థుల ఎంపిక



ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం రాజేంద్రబాబు

మదనపల్లె అర్బన్, జూన్6: జాతీయ ఉపకార వేతనాలకు నిరుపేదల ఇళ్లలో వెలుగు నింపుతూ విద్యాకుసుమాలు ప్రతిభ కనపర్చారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డి లేవుట్‌లో ఉన్న వివేకా నంద మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 25 మంది విద్యార్థులు జాతీయ ఉపకారవేతనాలకు(ఎన్ఎంఎంఎస్) ఎంపికయ్యా రు. ఇటీవల వెలువడిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలి తాల్లో జిల్లాలో 145 మంది విద్యార్థులు విజయం సాధించగా ఇందులో వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 25 మంది ఎంపికయ్యారు. అంతేగాకుండా ఇందులో మదనపల్లె పట్ట ణం రెడ్డీస్ కాలనీకి చెందిన స్వర్గీయ కేఎస్ సుబ్రహ్మణ్యం కుమార్తె కెసాయిసాహితీ 131 మార్కులు సాధించి అన్నమయ్య జిల్లాలోనే ప్రథ మ స్థాయిలో నిలిచింది. ఇంకా నీరుగట్టువారి పల్లెలోని వీవర్స్ కాలనీకి చెందిన జి. రామయ్య కుమారుడు జి. ఆదివిష్ణు 127 మార్కులు సాధించి స్కూల్లో ద్వితీయ స్థానం, టీ స్టాల్ నిర్వహిస్తున్న నీరుగట్టు వారిపల్లె రామిరెడ్డి లేవుట్‌కు చెందిన ఎస్ ఇనాయతుల్లా కుమారుడు ఎస్ రియాజ్ 112 మార్కులు సాధించి స్కూల్లో తృతీయ స్థానంలో నిలిచారు. గురువారం పాఠశాల హెచ్ఎం జి. రాజేంద్రబాబు పిల్లతో కలిసి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఎన్ఎంఎంఎస్‌లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందనలతోపాటు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా 2023-24 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపర్చారని ఆయన చెప్పారు. ఇందులో 278 మంది పరీక్షకు హాజరు కాగా 256 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. 500 మార్కులపైనా 61 మంది విద్యార్థులు సాధించారని హెచ్ఎం తెలిపారు.

టీడీపీ విజయంతో సంబరాల్లో పార్టీ శ్రేణులు



పీలేరు బండ్లవంకలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు



కురబలకోట మండలం అంగళ్లులో టీడీపీ నేతల సంబరాలు

పీలేరు, జూన్ 6: పీలేరులో టీడీపీ అపూర్వ విజయంతో పార్టీ శ్రేణుల సంబరాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని బండ్లవంకలోని మాతమ్మ ఆలయంలో గురువారం టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి, తెలుగు మహిళా నాయకురాలు పురం రెడ్డమ్మ ఆధ్వర్యంలో మాతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించడంతో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆ తర్వాత ఆలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అదే విధంగా తలపుల గ్రామంలో మాజీ సర్పంచ్ అబ్బవరం అమరనాథరెడ్డి నేతృత్వంలో గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు. బళ్లారి డ్రమ్స్, బాణాసంచా పేలుళ్ల, చెక్కభజనలు, కోలాటాల మధ్య భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాదర్ బాషా, లక్ష్మీకర, కోటపల్లె శివ, గాండ్ల విజయ్ కుమార్, చందన, స్వర్ణ, సుశీలమ్మ, రత్నమ్మ, సురేశ్, బాబ్జీ, ఆంజి, మల్లి, అమానుల్లా, హరీశ్, షఫీ, రియాజ్, నాగేంద్ర, హరి, శివ, ధన, మహబూబ్ బాషా, అశోక్, మహేశ్, చందు, టీచర్ నాగయ్య, పీవీ రమణ పాల్గొన్నారు.

కురబలకోటలో ఘనంగా సంబరాలు

కురబలకోట, జూన్ 6: ఎన్నికల ఫలితాలలో టీడీపీ అత్యధిక స్థానాలు సాధించి కూటమి అధికారాన్ని కైవవసం చేసుకోవడంతో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అంగళ్ళు కూడలిలో పెద్ద ఎత్తున గ్రామాసంచా పేల్చి, కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టి బస్టాండ్ కూడలిలో టీడీపీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు హెచ్చుమీరడంతో ప్రజలు ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించారని రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అఖండ మెజారిటీకి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు ప్రమాణస్వీకారానికి పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ తెలుగుయువత ప్రధానకార్యదర్శి, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, అశోక్, ముస్కీన్‌వల్లీ, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, ఎంవీనాయుడు, మధుకర్‌రెడ్డి. శంకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సదాశివ, తెట్టు ఉపసర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కిశోర్‌కుమార్‌రెడ్డి



పీలేరు, జూన్6:తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడును పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించడం తో కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆయన తనయుడు నల్లారి అమరనాథరెడ్డితో కలిసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలిసిన యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్/టౌన్, జూన్ 6: మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను గురువారం యూటీఎఫ్ మదనపల్లె డివిజన్ నాయకులు తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, టి. భాస్కర్‌రెడ్డి, డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్, నాయకులు అంజాద్, హరికృష్ణ, పయని నాగభూషణం, పాల్గొన్నారు. మదనపల్లె ఎమ్మెల్యేగా గెలుపొందిన ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషాకు గురువారం ఆయన నివాసం వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, కాలని నాయకులు, సంఘమిత్రలు, పురప్రముఖులు వచ్చి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.



నిమ్మనపల్లెలో శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

నిమ్మనపల్లిలో: మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను గురువారం నిమ్మనపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, తెలుగు యువత అధ్యక్షుడు చినబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ప్రజల విజ యమని కార్య కర్తలకు నాయకులకు, ప్రజలకు ఎటువంటి సయస్య వచ్చినా తాను ఉంటానని, అవినీతి లేని పరిపాలనను అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయన్న, అన్వర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో జనసేన సంబరాలు



కేక్ కట్ చేస్తున్న జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత

మదనపల్లె, జూన్ 6: సాధారణ ఎన్నికల్లో జనసేన ఘన విజయం సాధించడం పట్ల ఆపార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక బర్మావీధిలోని జనసేన కార్యాలయంలో ఆపార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆపార్టీ నేతలు శ్రీరామ రామాంజనేయులు, దారం అనితలు మాట్లాడుతూ పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తోపాటు రాష్ట్రంలో పోటీ చేసిన మరో 20 మంది అభ్యర్థులు విజయం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర, దేశ చరిత్రలో ఎవరూ కనీవినీ ఎరుగని విజయాన్ని జనసైనికులు సాధించారని వారు కొనియాడారు. అలాగే అసెంబ్లీ, పార్లమెంటులో విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్రకమిటీ సభ్యురాలు, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, మల్లిక, లక్ష్మీదేవి, లక్ష్మీ, నాయకులు కుప్పాల శంకర్, కోటకొండ చంద్రశేఖర్, ధరణి, అశ్వత్, అశోక్, యాసీన్, గణేష్, గురునాథ్, శ్రీనాథ్, శ్రీనివాసులు, మల్లికార్జున, టి.శివ, మారుతి, శివ, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గుడిసెలలోనే గిరిజనుల బతుకులా..?

● గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్



గిరిజన సమస్యలను అడిగితెలుసుకొంటున్న బుక్కే విశ్వనాథ్‌నాయక్

మదనపల్లె అర్బన్, జూన్ 6: స్వాతం త్ర్యం సిద్ధించి 76 ఏళ్లు గడుస్తున్న ఇప్ప టికీ గిరిజనలు ప్లాస్టిక్ గుడిసెల్లో జీవనం సాగించే దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లె మండలంలోని సీటీఎం పంచాయతీలో చెంచులక్ష్మీ గిరిజన కాలనీలో ఏపీ గిరిజ న సమా ఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో మౌలిక వసతులు లేవని, డ్రైనేజ్ కాలువలు లేవని, విద్యుత్ సౌకర్యం లేక మగ్గుతున్నారని వాపోయారు. కనీసం చనిపోతే పూడ్చడానికి సెంటు స్థలం కూడా శ్మశాన వాటికకు వదలేదన్నారు. ఆకలికేక లతో దినసరి కూలీలుగా జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి వారి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు సిద్దయ్య, మునిగట్టయ్య, అనసూయ, భాగ్యమ్మ, వెంకటమ్మ, నీలమ్మ, మురళి, భూదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల నిలిపివేత



వడ్రంగి అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దారు

పీలేరు, జూన్ 6: పీలేరు-మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గురువారం సాయంత్రం రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో పీలేరు వడ్రంగి అసోసియేషన్ సభ్యులకు గతంలో వైసీపీ నాయకులు ఇంటి పట్టాలు మంజూరు పేరుతో గుట్టను కేటాయించారు. ఆ గుట్టను వడ్రంగి అసోసియేషన్ సభ్యులు చదును చేసుకుని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు మహబూబ్‌బాషా ఆ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవని, నాయకులు ఏమైనా పత్రాలు ఇచ్చి ఉంటే తన కార్యాలయంలో రెండు రోజుల్లో అందజేయాలని, ఆదేశించారు. ఆర్ఐ చాణక్య, వీఆర్వో రమ్యకృష్ణ, పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తుల వితరణ

మదనపల్లె టౌన్, జూన్ 6: మదనపల్లె మండలం సీటీఎం జడ్పీహైస్కూల్లో నిర్వహించిన ఫుట్‌బాల్ సమ్మర్‌కోచింగ్ క్యాంప్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు పూర్వ విద్యార్థులు క్రీడాదుస్తులు వితరణగా అందజేశారు. గురువారం సీటీఎంలో నిర్వహించిన కార్యక్రమంలో జినరాజాదాస హాకీక్లబ్, వివేకానంద బాస్కెట్‌బాల్ అకాడమి నిర్వాహకులు మాట్లాడుతూ మొత్తం 80 మంది విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించి బహుమతులు, జ్ఞాపికలు అందజేశామన్నారు. పూర్వ విద్యార్థులు ముని, నగేష్‌తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

పీటీఎం శివప్రసాద్‌కు బోధిసిరి అవార్డు

మదనపల్లె, జూన్ 6: బౌద్ధ ధర్మవ్యాప్తి కోసం పదిహేనేళ్లగా క్రియాశీలకంగా పనిచేస్తున్న పీటీఎం శివప్రసాద్‌కు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆయుష్మాన్ హరిబాబు బోధిసిరి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంపై ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, రిటైర్డ్ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, అన్నమయ్య జిల్లా బీఎస్ఐ అధ్యక్షుడు కేవీ రమణ, బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, వీసీకేపార్టీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసులు, బుద్ధఅంబేద్కర్ సమాజ్ ట్రస్టు సభ్యులు రమణ, చాట్ల బయన్న, సొన్నికంటి రెడ్డెప్పలు హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా..



బి.కొత్తకోటలో టీడీపీ శ్రేణులతో దాసరిపల్లె జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, జూన్6: తాజా ఎన్నికలలో ఓడినప్పటికీ తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యకర్తలకు, ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని నియోజకవర్గ నేత, టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట పట్టణంలోని జ్యోతిసర్కిల్‌లో జరిగిన మహాకూటమి విజయోత్సవ సంబరాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భారీ కేక్ కట్‌జేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహాకూటమికి ఇంతటి ఘనవిజయాన్నిచ్చిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో వెన్నుపోట్ల వల్ల గెలవక పోయినా నైతిక విజయం తనదేనన్నారు. తంబళ్లపల్లె పై అధినేత చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టబోతున్నారని, ఇకపై ఇక్కడి ఎమ్మెల్యే ఆటలు సాగవని, అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించినవన్నీ తిరిగి రాబడతామని వ్యాఖ్యానించారు. అధికారులు స్వేచ్ఛగా పనిచేసేలా చూస్తామని, వైసీపీ కబంధ హస్తాలలో నలిగిపోయిన పేదలకు, రైతులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ప్రజాసంక్షేమం, తంబళ్లపల్లె అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి రెడ్డి, బంగారువెంకట్రమణ, కుడుంశ్రీనివాసులు, చింతల కిరణ్, యండీ మస్తాన్, కనకంటిప్రసాద్, ప్రభాకర్, సంపతికోటకిట్టన్న, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరువర్గాల టీడీపీ కార్యకర్తల వాగ్వాదం

బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో కేక్‌కట్ చేయడానికి జయచంద్రారెడ్డి రాక సందర్భంగా టీడీపీకే చెందిన ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వాస్తవానికి గురువారం జి.శంకర్ ఆదేశాలతో జ్యోతిసర్కిల్ లో మహాకూటమి విజయోత్సవం నిర్వహిస్తున్నామని కొందరు నాయకులు సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారు. మరికొంత సేపటికి అదే ప్రదేశానికి అదే సమయానికి జయచంద్రారెడ్డి కేక్‌కట్ చేస్తారంటూ మరోవర్గం పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో జయచంద్రారెడ్డి రాకముందు ఇరువర్గాలు ఎదురుపడి వాదోపవాదాలు చేసుకున్నారు. జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఓ వర్గం, అనుకూలంగా మరోవర్గం తలపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కబెట్టారు. అనంతరం కార్యక్రమం యథావిధిగా జరిగింది.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నైతికంగా ఓడిపోయారు



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, జూన్ 6: వైసీపీ పాలనలో సెకండ్ సీఎంగా చెప్పుకునే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో కేవలం 6 వేల ఓట్లతో బయటపడినా నైతికంగా ఓడిపోయినట్లేనని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. గురువారం మంగళగిరి నుంచి మదనపల్లెకు వచ్చిన శ్రీరామ్‌చినబాబుకు స్థానిక నీరుగట్టువారిపల్లెలో తెలుగు యువత నాయకులు, టీడీపీ నాయకులు, చేనేత కార్మికులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో చినబాబు మాట్లాడుతూ వైనాట్ 175 అంటూ భీరాలు పలికిన జగన్‌కు ఎన్నికల ఫలితాల్లో రెండంకెలు మాత్రమే వచ్చాయన్నారు. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌కు ఈ సంఖ్యలో 5 తీసేసి కేవలం 11 ఇచ్చారన్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని దీని పర్యవసనమే దేశ చరిత్రలో ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి కూటమికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారన్నారు. మదనపల్లెలో ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాను గెలిపించిన ప్రతి ఒక్కరికి పాదాభివందనం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేతో చర్చించి మదనపల్లె అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్దప్ప, యోగేశ్వర్‌బాబు, రాటకొండ మధుబాబు, దొరస్వామినాయుడు, చీకిలబైలు సర్పంచ్ ప్రభాకర్, నాదెళ్ల అరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధికి అడ్డుకట్ట



బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది.

తంబళ్లపల్లె, జూన్ 6: బీసీజీ టీకా తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి రాకుండా అడ్డుకట్ట వేయవచ్చని వైద్యాధికారి డాక్టర్ మునికుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా అర్హులైన ప్రతిఒక్కరూ బీసీజీ టీకాలు వేసుకోవాలన్నారు. ఈ టీకా వేసుకోవడం వలన రోగ నిరోధక శక్తి పెరిగి క్షయ వ్యాధి రాకుండా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, ధూమపానం, మద్యపానం చేసేవారు, క్షయ వ్యాధి బారినపడి కోలుకున్నవారు, వారి కుటుంబసభ్యులు సైతం టీకా వేసుకోవచ్చని సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా 481 మందికి బీసీజీ టీకా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పీటీఎంలో బీసీజీ టీకాలను వేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దతిప్పసముద్రంలో: బీసీజీ టీకాతో టీబీ వ్యాధిని నివారించవచ్చని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ పురుషోత్తంనాయక్, టీబీ సూపర్ వైజర్ రామకృష్ణ నాయుడులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి పలువురుకి బీసీజీ టీకాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన వారందరికి, 18 -60 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారికి 5 సంవత్సరాల కిందట టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగ తాగేవారికి బీసీజీ టీకాలు వేసి వ్యాధిని నివారించాలని వారు వైద్య సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాల్లో సుమారు 100 మందికి పైగా బీసీజీ టీకాలను వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ శేషాద్రితో పాటు ఏఎన్ఎం రామకృష్ణమ్మ, లతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కలికిరిలో బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి కావ్యగంధ

కలికిరిలో: వయోజనులకు వేసే బీసీజీ టీకాలతో క్షయ వ్యాధిని నిరోధించవచ్చని మేడికుర్తి వైద్యాధికారిణి డాక్టర్ కావ్యగంధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆర్ఎస్‌రోడ్డు, కలికిరి-4 సచివాలయం, బరిణేపల్లెలో బీసీజీ టీకాల కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు బీసీజీ టీకాల వల్ల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. 60 ఏళ్ల వయసు పైబడిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీతో కోలుకున్నవారితోపాటు వారి కుటుంబ సభ్యులు, వయసుకు తగ్గ బరువు లేని 18 ఏళ్ల వయసువారు, బీసీజీ టీకాలకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ మహ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు కృష్ణకుమారి, పావని, ఏఎన్ఎంలు మాధవి, రమాదేవి, ఆశా కార్యకర్తలు జ్యోతి, దీన, లలిత, అంగన్‌వాడీ కార్యకర్త స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



కేవీపల్లెలోని సొరకాయలపేటలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డా.డేనీ ఫ్రాంక్లిన్

పీలేరులో: పీలేరు, కేవీపల్లె మండాలాల్లో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని గురువారం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేక పరిశీలకుడు డాక్టర్ డేనీ ఫ్రాంక్లిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ బీసీజీ టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి వయోజనులను సంసిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయన టీకాలు పొందుతున్న వయోజనులతో మాట్లాడి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రమేశ్ రెడ్డి, రేష్మ, చంద్రశేఖర్, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, హెచ్ఈ కొండయ్య, పీలేరు టీబీ యూనిట్ సిబ్బంది మోహన, పవన్, ఆరోగ్య సిబ్బంది రిహానా, వెంకటరమణ, చంద్ర, మైత్రి సుధా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐటీ ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక



ఎన్ఐటి ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట, జూన్ 6: పుదుచ్చేరిలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటీ ఇంటర్న్‌షిప్‌కు 5మంది మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం సీఎస్ఈ విభాగానికి చెందిన యశ్వంత్‌కుమార్, సుషాంత్‌రెడ్డి, జశ్వంత్, లేపాక్షి, జాహ్నవిలు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. వారు 6 వారాల పాటు మిషన్‌లర్నింగ్‌పై పరిశోధనలు చేస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ ప్రిన్సిపాల్ సి.యువరాజ్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.